భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆధార్ నవీకరణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల గడువు శుక్రవారంతో ముగియనుంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా శిబిరాలు నిర్వహించినా, వాటిని వినియోగించడంలో మాత్రం ప్రజలు ఉదాసీనత ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు ఆరు లక్షల మంది ఆధార్ నవీకరణకు దూరంగా ఉన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలన్నింటికీ ఆధార్ తప్పనిసరి. వీటిలో సాంకేతిక తప్పిదాలుంటే అర్హులు సైతం సంక్షేమ ఫలాలకు దూరమయ్యే అవకాశముంది. ఇక ఆధార్‌లో పొరపాట్లు ఉంటే ఉద్యోగులు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పవు.


# ఆధార్ నవీకరణకు.. స్పందన అంతంతే..!

## ప్రత్యేక శిబిరాలకు నేటితో ముగియనున్న గడువు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 6,06,636 మంది ఆధార్ నవీకరించుకోవాల్సి ఉంది. అయిదు నుంచి 15 ఏళ్లు, 15 నుంచి 17 ఏళ్లు వయసున్న వారిలో సుమారు 3,02,818 మంది నవీకరణకు దూరంగా ఉన్నారు. ఆధార్ పొంది పదేళ్లు పూర్తయిన వారు ఆధార్ నవీకరించాల్సి ఉంది. ఇందు కోసం ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామ సచివాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 88 ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశారు.


తోలేరులో ప్రత్యేక శిబిరం

ఉమ్మడి జిల్లాలో వేలిముద్రలు నవీకరించుకోవాల్సిన వారు




**సర్వర్ మొరాయింపు..** మొదటి రోజు పలుచోట్ల సర్వర్ మొరాయించడంతో ఆధార్ నమోదు, నవీకరణ ప్రక్రియ ఆలస్యమైంది. 22న తొలి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,125, దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. రెండో రోజు 1,364, మూడో రోజు గురువారం సాయంత్రం 4 గంటల వరకు 980 దరఖాస్తులు నవీకరించారు. 'ఆధార్ నవీకరణకు మొదటి రోజు అక్కడక్కడా సర్వర్ అవాంతరాలు తలెత్తాయి. శుక్రవారంతో శిబిరాలు ముగియనున్నాయి. అవసరం మేరకు ప్రత్యేక శిబిరాల కొనసాగింపును ఉన్నతాధికారులు పరిశీలిస్తారు' అని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి తెలిపారు.

## భీమవరంతో విడదీయరాని బంధం


సినీ కథానాయకుడు కిరణ్ అబ్బవరం

**భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే:** భీమవరంతో తనకు విడదీయరాని బంధముందని సినీ కథానాయకుడు కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన నటించిన 'క' చిత్రం ఈ నెల 31న విడుదల కానున్న నేపథ్యంలో... గురువారం ఆయన భీమవరం వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... తాను నటించిన తొలి లఘు చిత్రం 'ఓ మనసా ఇటు రావే'ని భీమవరంలోనే చిత్రీకరించినట్లు చెప్పారు. 1977లో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా 'క' చిత్రాన్ని రూపొందించామని వివరించారు.

## పాలకొల్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

**పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు రావడంతో జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వరరావు గురువారం విచారణ చేపట్టారు. కార్యాలయంలో స్కానింగ్, డాక్యుమెంటేషన్‌లను తనిఖీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ సుధారాణితోపాటు ఆరోపణలు చేసిన లేఖర్లను, క్రయవిక్రయదారులను విచారించారు. అనంతరం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ప్రాథమిక విచారణలో దస్త్రాలన్నీ సక్రమంగానే ఉన్నాయన్నారు. దీనిపై పూర్తి విచారణ నిర్వహిస్తామన్నారు.

# పోలీస్ స్టేషన్‌లోనే పంచాయితీలు




- కేసుల నమోదులో అలసత్వం
- వివాదాస్పదంగా కొందరు పోలీసుల తీరు

**ఈనాడు, ఏలూరు:** కొందరు పోలీసుల తీరు మొత్తం ఆ వ్యవస్థకే మచ్చతెస్తోంది. సామాన్యులు న్యాయం కోసం వెళ్తే ఎఫ్ఐఆర్ నమోదు చేయడం మాని స్టేషన్‌లోనే పంచాయితీలు చేస్తున్నారు. విచారణ చేయకుండా ముడుపులు తీసుకుని పెదరాయుడి తీర్పులిస్తున్నారు. ఫలితంగా సామాన్య ప్రజల్లో దిక్కుతోచని దైన్యం ఆవరించింది.

- ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి భర్త చనిపోయిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగాయి. సహజీవనం చేస్తున్న మహిళ కొంత మందిని తీసుకెళ్లి అతని భార్య, పిల్లలను కొట్టించారు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. పైగా కొట్టించిన మహిళ నుంచి రూ.లక్ష వరకు తీసుకుని కేసు నమోదు చేయాలంటే ఎదురు కేసు పెడతామని బెదిరించారు. ఈ విషయంలో ఏఎస్ఐ, ఓ కానిస్టేబుల్ కీలక పాత్ర పోషించారు.
- దెందులూరు మండలానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి 2014లో తన ద్విచక్ర వాహనం పోగొట్టుకున్నారు. అదే వ్యక్తికి చెందిన మరో ద్విచక్ర వాహనాన్ని 2019లో మళ్లీ దొంగిలించారు. రెండు సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఇప్పటికీ కేసు నమోదు చేయలేదు. ఇటీవల ఏలూరు కండ్రికగూడెంలో బండి దొంగతనం జరిగిందని ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన వ్యక్తి నుంచి తీసుకోకుండా ఓ ఎస్సై దుర్భాషలాడారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఇప్పటి వరకు సుమారు 50 వాహనాలు చోరీకి గురైనా పది కేసులు కూడా నమోదు కాలేదు.
- భీమవరంలోని ఓ దుకాణంలో పని చేసే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. అతను సాధారణంగా చనిపోయినా పోలీసులు యజమానిపై అనుమానం ఉందని తల్లిదండ్రులతో ఫిర్యాదు చేయించారు. యజమానిని బెదిరించి రూ.2లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేశారు. దీంతో భయపడిన యజమాని రూ.1.25 లక్షలు ఇచ్చారు. ఆ పోలీసు అధికారి ఓ ఏఎస్ఐ, కానిస్టేబుల్‌ను అనుచరులుగా మార్చుకుని నిత్యం ఇదే దందా చేస్తున్నారు.

### స్టేషన్‌లో యువతి ఆత్మహత్యాయత్నం

మహిళా పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదుల విషయంలో పోలీసుల తీరు దారుణంగా ఉంటోంది. బాధిత మహిళలు ప్రాధేయ పడినా కేసులు కట్టడం లేదన్న విమర్శలున్నాయి. కౌన్సెలింగ్ ముసుగులో పంచాయతీలు చేసి కమీషన్లు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన భార్యాభర్తల వివాదంలోనూ పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. బాధితురాలు కొన్ని రోజులుగా భర్తపై కేసు నమోదు చేయాలని చెప్పినా పోలీసులు పట్టించుకోలేదని తెలుస్తోంది. స్టేషన్ ఆవరణలోనే భార్య..ఆమె చెల్లెలితోనూ అతను ఘర్షణ పడినా చక్కదిద్దలేదు. చివరికి స్టేషన్‌లోనే యువతి ఆత్మహత్యాయత్నం చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### కాసులు దండుకుంటూ..




పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదుల్లో 10-20 శాతం కేసులు కూడా నమోదు కావడం లేదు. రహదారి ప్రమాదాలు, ఘర్షణల్లో గాయాలైన వారు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరతారు. అక్కడ వివరాలు నమోదు చేసి ఆయా స్టేషన్లకు పంపిస్తారు. వీటన్నింటిపైనా పోలీసులు కేసులు నమోదు చేయాలి. కానీ చాలా చోట్ల వారే పంచాయితీలు చేసి కాసులు దండుకుంటున్నారు. ఈ ఘటనల్లో ప్రభుత్వ ఉద్యోగులు నిందితులుగా ఉంటే కేసులు లేకుండా చేసి వారి నుంచి భారీగా వసూలు చేస్తున్నారు. ఈ తరహా కేసులు ఉభయ జిల్లాల్లో నెలకు దాదాపు 600 వరకు ఉంటే వీటిలో 100 కూడా నమోదు చేయడం లేదని తెలుస్తోంది. ఈ పరిస్థితిపై ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీసుస్టేషన్లలో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నాలుగింటికే నిధులొచ్చాయ్!

**పురపాలక ఖాతాలకు ఆర్థిక సంఘం నిధులు**

**పాలకవర్గాల్లేని పట్టణాలకు మొండిచేయి**


**పాలకొల్లు, న్యూస్‌టుడే:** ఉమ్మడి జిల్లాలో ఏ పురపాలిక చూసినా చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలు లేవు. పాలకొల్లు, భీమవరం పట్టణాల్లోని శివారు ప్రాంతాల్లో నేటికీ తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో జరగడం లేదు. డ్రెయిన్ల తీరయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. పట్టణాలన్నీ చినుకుపడితే చిత్తడిగా మారిపోతున్నాయి. వీధి దీపాల సమస్య ఉండనే ఉంది. వీటిలో ఏ ఒక్క పని చేసుకోవాలన్నా ఆర్థిక సంఘం నిధులు దోహదపడేవి. అయిదేళ్ల వైకాపా పాలనలో ఆర్థిక సంఘం నిధులు సైతం స్వాహా చేయడంతో నిర్వహణ పనులకు దిక్కులు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్థిక సంఘం నిధుల విడుదల సక్రమంగా జరగక పోవడంతో చిన్న చిన్న పనులు కూడా ఎక్కడికక్కడ పడకేశాయి.


పాలకొల్లులో నిధులు లేక నిలిచిన డంపింగ్‌యార్డు పనులు

**ఖాతాలకు జమ..** తాజాగా ఉమ్మడి జిల్లాలోని ఏలూరు నగరపాలిక, నూజివీడు, జంగారెడ్డిగూడెం, నరసాపురం పురపాలక సంఘాలకు ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. పీఎఫ్ఎంఎస్ ఖాతాలకు 2023-24 ఆర్థిక సంవత్సర తొలి విడత నిధులు జమచేశారు. వాటితో ఆయా పట్టణాల్లో ఉన్న సమస్యలను కొంత వరకైనా పరిష్కరించేలా నిబంధనలకు అనుగుణంగా సద్వినియోగం చేసుకుంటే పౌరసేవలు మెరుగుపడే అవకాశం ఉంది.

**ఏయే పనులంటే..** పట్టణాల్లో తాగునీటి సమస్యలు, వీధి దీపాల నిర్వహణ, డ్రెయిన్లు, చెత్త సేకరణ వంటి పనులకు ఆర్థిక సంఘం నిధులను వినియోగించాలి. వీటి తర్వాత ప్రాధాన్య క్రమంలో పార్కుల అభివృద్ధి, రోడ్ల నిర్మాణం వంటి పనులకు సాధారణ నిధులకు వీటిని జతచేసి ఉపయోగించవచ్చు. ఇంటింటికీ రక్షితనీరు అందించడానికి కూడా నిధులు వెచ్చించవచ్చు. నిధులొచ్చాక నిరీక్షించకుండా సకాలంలో పనులు చేసి ఆయా నిధులు మురిగిపోకుండా చూసుకోవాల్సి ఉంది.

**ఎన్నికలు జరగక నిధులివ్వలే..** ఆర్థిక సంఘం నిధులు మంజూరు కావాలంటే ఆయా పురపాలికలకు పాలకవర్గాలుండాలి. పాలకొల్లు, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం పురపాలక సంఘాలకు ఎన్నికల ప్రక్రియ పూర్తిగాక ఈ అవకాశం లేకుండా పోయింది. అసలే అంతంతమాత్రంగా నిధులు వస్తున్న ప్రస్తుత తరుణంలో పాలకవర్గాలు లేకపోవడం పెద్ద నష్టమే మిగిల్చింది. పురపాలికలో గ్రామాల విలీన ప్రక్రియపై న్యాయస్థానంలో కేసులు వేయడంతో ఈ సమస్య ఏర్పడింది.




పురపాలక శాఖ రాజమహేంద్రవరం ఆర్డీ నరసింహారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా పాలకవర్గాలు లేని పురపాలికలకు ఈ ఏడాది ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి కేంద్రం నుంచి నిధులు విడుదల చేయించడానికి ప్రయత్నిస్తోందన్నారు.

## సమన్వయంతో ఎన్నికల నిర్వహణ: కలెక్టర్


మాట్లాడుతున్న నాగరాణి, పక్కన జేసీ

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 31లోపు ప్రాదేశిక నియోజకవర్గాల జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జలవనరులు, రెవెన్యూ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 20 నీటి సంఘాలుండగా.. వాటిలో 14 పశ్చిమ గోదావరి, 4 ఏలూరు, 2 తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్వో ఉదయభాస్కరరావు, జలవనరుల శాఖ జిల్లా అధికారి నాగార్జునరావు, ఆర్డీవోలు దాసిరాజు, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, భవానీశంకరి తదితరులు పాల్గొన్నారు. ★ ప్రజా పంపిణీ వ్యవస్థను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ నాగరాణి సూచించారు. కలెక్టరేట్‌లో పౌర సరఫరాల అధికారులు, తహసీల్దార్లతో ఆమె సమావేశమై మాట్లాడారు. పేదల బియ్యాన్ని నల్ల బజారుకు తరలించి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ★ పంటల బీమా పథకానికి సంబంధించి రైతుల పేర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. అమరావతి నుంచి వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ రాజశేఖర్ దృశ్య సమావేశం నిర్వహించగా- స్థానిక కలెక్టరేట్ నుంచి నాగరాణి పాల్గొన్నారు.

## ధాన్యం సేకరణకు ఏర్పాట్లు

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ఖరీఫ్ ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో 25 శాతం గోనె సంచులను ముందుగానే భద్రపరచాలన్నారు. సంక్షేమ, విద్యా సహాయకులను రైస్‌మిల్లుల వద్ద వాహనాల పర్యవేక్షణకు నియమించామన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా అధికారిణి సరోజ, డీఎం శివరామ ప్రసాద్ పాల్గొన్నారు.



## పశ్చిమ డీఈవోగా నారాయణ



**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** పశ్చిమగోదావరి జిల్లా విద్యా శాఖాధికారిగా ఇ.వి.వి.ఎన్.ఎస్.ఎస్.ఎస్.బి.ఎల్.నారాయణ నియమితులయ్యారు. రాజమహేంద్రవరం డీవైఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ఆయనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి పశ్చిమ డీఈవోగా నియమించింది. గతంలో నారాయణ పశ్చిమగోదావరి జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్‌గా వ్యవహరించారు.

## జిల్లా రెవెన్యూ అధికారిగా వెంకటేశ్వర్లు

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న జె.ఉదయభాస్కరరావు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఎం.వెంకటేశ్వర్లును నియమిస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## నారసింహం.. నయన మనోహరం



**వాడపల్లి(ఆత్రేయపురం), న్యూస్‌టుడే:** వాడపల్లి శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సింహ వాహనంపై స్వామి వైభవంగా ఊరేగారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి యోగనరసింహ అలంకరణలో తిరువీధుల్లో విహరించడంతో భక్తులు జయజయ ధ్వానాలు చేశారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో తాను సింహ సమానంతో ప్రయత్నిస్తానన్న శ్రీవారి సందేశాన్ని ఈ సందర్భంగా పండితులు వినిపించారు. మహాస్నపన, ప్రధాన హోమాలు, తిరుప్పావడ సేవ, మహాశాంతి హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.

వట్టివేళ్ల అలంకరణలో ఉత్సవ మూర్తులు


తిరుప్పావడ సేవలో అర్చకులు, ప్రజాప్రతినిధులు

## చిరుత.. ఇంకా చిక్కలేదు

**జగన్నాథపురం పొలాల్లో అడుగు జాడలు**


పెదవేగి మండలం జగన్నాథపురంలో చిరుత అడుగులను పరిశీలిస్తున్న అటవీ, పోలీసు శాఖల అధికారులు

**పెదవేగి, భీమడోలు, న్యూస్‌టుడే:** కొన్ని రోజులుగా భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లో కనిపించిన చిరుత తాజాగా పెదవేగి మండలం జగన్నాథపురంలోని పంట పొలాల్లో సంచరిస్తున్నట్లు అటవీ శాఖాధికారులు గురువారం ప్రకటించారు. అటవీ శాఖ ఏలూరు రేంజర్ కుమార్, పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సై కె.రామకృష్ణలు తమ సిబ్బందితో జగన్నాథపురం వెళ్లి అడుగులను పరిశీలించారు. అవి చిరుతవే అని నిర్ధారించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భీమడోలు మండలం పోలసానిపల్లి శివారు ఆంజనేయనగరం ప్రాంతంలో కూడా చిరుత కాలి గుర్తులు కనిపించడంతో పోలవరం కుడి కాలువ గట్టు వెంబడి అటువైపు వెళ్లి ఉంటుందని అటవీ శాఖాధికారులు భావిస్తున్నారు. గ్రామానికి చెందిన బాబి బుధవారం రాత్రి తన పంట పొలాల వద్దనున్న కోళ్ల ఫారం వద్ద నుంచి ఇంటికి బయలుదేరారు. రహదారిలో చిరుత నిద్రిస్తూ కనిపించడం చూసి గ్రామానికి వచ్చి స్థానికులకు తెలిపారు. గ్రామస్థులు ఈ విషయాన్ని పోలీసులకు తెలపడంతో వారు పెదవేగి సీఐ, అటవీ శాఖ ఏలూరు రేంజర్‌కు సమాచారమిచ్చారు. వారు గురువారం ఉదయం జగన్నాథపురం వచ్చి కాలి అడుగుల్ని పరిశీలించి చిరుతవిగా నిర్ధారించారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుతను పట్టుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని రేంజర్ కుమార్ తెలిపారు.

# చిట్టి చేతులు.. గట్టి చేతలు

## వరద బాధితులకు రూ.లక్ష విరాళం



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న పాఠశాల ప్రతినిధులు

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం భీమవరంలోని వెస్ట్‌బెర్రీ పాఠశాల విద్యార్థులు రూ.లక్ష విరాళాలు సేకరించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసి రూ.లక్ష చెక్కు అందజేశారు. వారిని కలెక్టర్ అభినందించారు. పాఠశాల ప్రతినిధులు మహేశ్‌కుమార్, స్మిత తదితరులు పాల్గొన్నారు.

# సత్వరం రీ సర్వే ఫిర్యాదుల పరిష్కారం

**భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే:** భూముల రీ సర్వే లోటుపాట్లపై నిర్వహించిన గ్రామసభల్లో రైతులిచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో రీ సర్వేపై సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులతో గురువారం ఆమె సమీక్షించి మాట్లాడారు. భూ యజమానులను పిలిపించి పక్కడ్బందీగా రీ సర్వే చేయాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండదని ఆమె పేర్కొన్నారు.

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూముల సమస్యల పరిష్కారానికి సభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ల్యాండ్ రికార్డ్సు ఎం.ఎ.కె.కుమార్ అన్నారు. సీతారాంపురం సౌత్ గ్రామ సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీతారాంపురం సౌత్, సీతారాంపురం నార్త్, రాజుగారితోట గ్రామాలకు చెందిన రైతులు 47 అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు దొండపాటి వెంకట్, పులపర్తి భ్రమరాంబదేవి, మాంద్రు మరియమ్మ, వీఆర్వోలు కడలి నాగేంద్రబాబు, ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి జాతీయ పశుగణన

**భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే:** జిల్లాలో శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జాతీయ పశుగణన సర్వే చేపట్టనున్నట్లు పశు సంవర్ధకశాఖ భీమవరం డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ జవార్ హుస్సేన్ తెలిపారు. సర్వేకు సంబంధించి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణనిచ్చినట్లు చెప్పారు. నాలుగు నెలలపాటు ఇంటింటికీ తిరిగి సర్వే చేసి, పశు సంపద సంఖ్యను నిర్ధారిస్తారన్నారు. ఈ సర్వేకు పాడి రైతులందరూ సహకరించాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు.

# అపరిచితులతో అప్రమత్తంగా ఉండండి



దొంగల చిత్రాలతో రూపొందించిన గోడపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పోలీసు అధికారులు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** ప్రయాణ సమయాల్లో అపరిచితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఆర్.జి.జయసూర్య సూచించారు. స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగల చిత్రాలతో రూపొందించిన గోడపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. వీరవాసరం, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాలకు బస్సులు, వాహనాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికుల నుంచి కొన్ని ముఠాలు బంగారు ఆభరణాలు, నగదు అపహరిస్తున్నారన్నారు. వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రయాణ సమయాల్లో విలువైన ఆభరణాలను భద్రంగా ఉంచుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీఐలు ఎం.నాగరాజు, బి.శ్రీనివాసు, కిరణ్‌కుమార్, వీర్రాజు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదంలో యువకుడి మృతి



ప్రదీప్ కుమార్ (పాత చిత్రం)

**పెనుగొండ గ్రామీణ, వీరవాసరం, న్యూస్‌టుడే:** రహదారి ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి దొంగరావిపాలెం కూరగాయల మార్కెట్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వీరవాసరం మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన సైదు ప్రదీప్ కుమార్(30) బుధవారం కిర్లంపూడి మండలం ఎస్.తిమ్మాపురంలో ఉన్న తన అన్నకు అనారోగ్యంగా ఉండటంతో ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో రాత్రి పది గంటల సమయంలో దొంగరావిపాలెం కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న గోతుల్లో పడిపోయారు. ఈ ఘటనలో అతని తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ప్రదీప్ కుమార్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.గంగధరరావు తెలిపారు. రహదారికి మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా తమ గోడు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు.





# మాట వింటారా.. మళ్లొస్తారా?

- జిల్లాలో వివాదాస్పదంగా కొందరు సబ్‌రిజిస్ట్రార్ల వైఖరి
- తాము చెప్పినట్లు చేయాలని హెచ్చరికలు

**భీమవరం అర్బన్, న్యూస్‌టుడే**

అధికారుల మాట వింటేనే పని పూర్తవుతుంది. లేదంటే ఏదొక కొర్రీ పెడతారు. ముప్పుతిప్పలు పెట్టి తిప్పించుకుంటారు. ఇదీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి జిల్లాలోని పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని దుస్థితి. ఈ జాబితాలో భీమవరం ముందుంది. ఇక్కడ కొన్నాళ్ల కిందట బాధ్యతలు స్వీకరించిన సదరు అధికారి వైఖరి వివాదాలకు తావిస్తోంది. గతంలో రాష్ట్ర స్థాయిలో పని చేశానని.. తనకెవరూ అడ్డుచెప్పరని నేరుగా క్రయవిక్రయదారులు, దస్తావేజు లేఖరులకు చెబుతుండటం గమనార్హం. గతంలో చెల్లు రసీదుకు రూ.వెయ్యి చెల్లించేవారమని.. . ఇప్పుడు ఏకంగా రూ.10 వేలు అడుగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### పాలకొల్లులోనూ దుమారం..

భీమవరంలో సంయుక్త సబ్‌రిజిస్ట్రార్‌గా పని చేసి... ప్రస్తుతం పాలకొల్లులో విధులు నిర్వర్తిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ వైఖరి సైతం దుమారం రేపుతోంది. చేయాల్సిన పనికి నేరుగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విషయం బయటపొక్కడంతో జిల్లా రిజిస్ట్రార్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఈ రెండు కార్యాలయాలను గురువారం హుటాహుటిన సందర్శించారు. అక్కడ పరిస్థితిని పరిశీలించారు. ఆయా కార్యాలయాల్లోని వ్యవహారాలను కొందరు నేరుగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు వివాదాలకు నిలయాలుగా మారగా- అక్కడ తిష్ఠ వేసిన ప్రైవేటు సిబ్బంది చేతివాటంపై పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



భీమవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



భీమవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయదారులు నిల్చొని కార్యకలాపాలు చేయించుకుంటున్న దృశ్యమిది. ఇక్కడ ఏ పని చేయించుకోవాలన్నా.. బ్రిటిష రాచరికపు విధానంలో నిల్చోవాల్సిందే. ఈ పద్ధతికి ఎన్డీయే ప్రభుత్వం చరమగీతం పాడినా, భీమవరంలో మాత్రం పూర్వ విధానమే కొనసాగుతోంది. సబ్‌రిజిస్ట్రార్ ఎదుట కనీసం కుర్చీలు లేకపోవడం ఇందుకు నిదర్శనం.

### మర్యాదగా నడుచుకోవాలని హెచ్చరించా..

భీమవరం సబ్‌రిజిస్ట్రార్ వైఖరిపై ఫిర్యాదు అందాయి. స్వయంగా కార్యాలయానికి వెళ్లి అక్కడి పరిస్థితుల్ని గమనించా. క్రయవిక్రయదారులతో మర్యాదగా నడుచుకోవాలని సంబంధిత అధికారిని హెచ్చరించా. సబ్‌రిజిస్ట్రార్ నగదు అడుగుతున్నారని కొందరు ఆరోపించగా- దానిపైనా విచారణ చేస్తున్నాం. లంచం తీసుకున్నట్లు తేలితే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. పాలకొల్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సైతం సందర్శించి వివరాలు సేకరించా.

**- లంకా వెంకటేశ్వర్లు, జిల్లా రిజిస్ట్రార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ, భీమవరం**

# దరఖాస్తుకు గడువు ఒక్క రోజే

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారంతో గడువు ముగియనుందని భీమవరం సహాయ సాంఘిక సంక్షేమాధికారిణి సీహెచ్ భానుమణి తెలిపారు. అభ్యర్థులు జ్ఞానభూమి.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# అప్పుల బాధతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**నార్సింగి, న్యూస్‌టుడే:** అప్పుల బాధతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం కోకాపేటలో చోటుచేసుకుంది. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు పట్టణానికి చెందిన నాగ ప్రభాకర్(27) గచ్చిబౌలిలోని వసతిగృహంలో ఉంటూ కోకాపేటలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలోనే కోకాపేటలోని విరూపాక్ష మెన్స్ హాస్టల్ 7వ అంతస్తుపై నుంచి కిందకు దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నాగప్రభాకర్ కోకాపేటలోని ఈ హాస్టల్ భవనానికి ఎందుకు వచ్చాడో అంతుచిక్కని ప్రశ్నగా మారింది. సికింద్రాబాద్‌లో ఉంటున్న మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**గృహిణి.. పటాన్‌చెరు, న్యూస్‌టుడే:** భర్త వివాహేతర సంబంధాన్ని తట్టుకోలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నరసాపురం మండలానికి చెందిన సునీత(44) భర్త అశోక్‌తో కలిసి పదేళ్లుగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి ఐలాపూర్ గ్రామంలో ఉంటోంది. అశోక్ సివిల్ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. అశోక్‌కు ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉందంటూ సునీత మదనపడుతోంది. దీనిపై తరచూ గొడవలు జరిగాయి. మంగళవారం అతను ఇంటికి రాకపోవడంతో సదరు మహిళతో ఉండొచ్చని సునీత మనోవేదనకు గురై ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

# నన్నయలో అంతర్ కళాశాలల బాస్కెట్‌బాల్ పోటీలు

**నన్నయ విశ్వవిద్యాలయం(రాజానగరం), న్యూస్‌టుడే:** నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపిక కార్యక్రమానికి గురువారం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి వివిధ కళాశాలల క్రీడాకారులు విచ్చేయగా.. వారికి శుభాకాంక్షలు తెలిపి, బాస్కెట్‌బాల్ గోల్ వేసి పోటీలు ప్రారంభించారు. వీసీ ఆచార్య మాట్లాడుతూ.. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం తరఫున 42 రకాల క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రెండు రోజులు యూనివర్సిటీలో నిర్వహించనున్న ఇంటర్ కాలేజియేట్ బాస్కెట్‌బాల్ మెన్ టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలక్షన్స్‌కు ఆయా కళాశాలల నుంచి 13 జట్లు, 12 మంది వ్యక్తిగత క్రీడాకారులు హాజరయ్యారన్నారు. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతుల ద్వారా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిభావంతుల జట్టు నవంబరు 1నుంచి 5వ తేదీ వరకు బెంగళూరులో క్రైస్ట్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. రిజిస్ట్రార్, స్పోర్ట్స్ బోర్డ్ ఇన్‌ఛార్జి కో ఆర్డినేటర్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపల్ డా.కె.సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.మూర్తి, సెలక్షన్ కమిటీ సభ్యులు రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, అబ్జర్వర్ పీఆర్ కళాశాల పీడీ రమణ, విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ అధ్యాపకులు, పీడీలు, కోచ్‌లు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

# ధరలు నియంత్రణలో విఫలం: సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

**భీమవరం వన్ టౌన్, న్యూస్‌టుడే:** నిత్యావసర సరకుల ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ ఆరోపించింది. స్థానిక మెంటేవారితోటలోని పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా సమావేశం నిర్వహించారు. పార్టీ సెక్రటేరియట్ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ... ఎన్డీయే ప్రభుత్వం నిత్యావసరాల ధరలు తగ్గించకపోగా, విద్యుత్తు బిల్లులు పెంచేందుకు యోచిస్తుండటం బాధాకరమన్నారు. వైకాపా ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీలతో ప్రజలపై భారం మోపిందని, ప్రస్తుత సర్కారు ఇంధన సర్దుబాటు పేరుతో విద్యుత్తు ఛార్జీలు పెంచేలా అడుగులు వేస్తోందని విమర్శించారు. విద్యుత్తు ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. నాయకులు చింతకాయల బాబూరావు, జేఎన్‌వీ గోపాలన్, కవురు పెద్దిరాజు, డి.కల్యాణి, బి.వాసుదేవరావు, వీవీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచి, ప్రధానోపాధ్యాయుడు

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే:** కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు గుల్ల ప్రసాదరావు గురువారం తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 22న ఏలూరులోని ఏఎస్ఆర్ స్టేడియంలో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మన్యం ఆంజనేయులు 3 వేల మీటర్ల పరుగులో ప్రథమ, 1500 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఉల్లిబోయిన మేరి షాట్‌పుట్‌లో ద్వితీయ, అండర్-14 విభాగంలో సుభాష్ హైజంప్‌లో ప్రథమ, మనోజ్ 200 మీటర్ల పరుగులో ప్రథమ, కాటి దీవెనకుమార్ 100 మీటర్ల పరుగులో తృతీయ, దేవకీ ప్రియాంక హైజంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు.

### జాతీయ స్థాయి వాలీబాల్..

**జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలకు జంగారెడ్డిగూడెం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని మానికల సుధారాణి ఎంపికైంది. ఈ నెల 23 వరకు హిందూపురంలో జరిగిన అండర్-17 వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సుధారాణి ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పీడీ వెంకటలక్ష్మి తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికుల సమ్మె విరమణ

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** వేతన బకాయిల కోసం ఆసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు కొద్ది రోజులుగా ఆందోళనలు చేపడుతున్నారు. త్వరలో సమ్మె చేపట్టాలని నిర్ణయించారు. కాగా, సంబంధిత గుత్తేదారు వేతన బకాయిలు చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా సమ్మె విరమించినట్లు ఏపీ మెడికల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

# న్యాయస్థానంలో కిటికీ అద్దాల ధ్వంసం

**నరసాపురం, న్యూస్‌టుడే:** న్యాయస్థానం పర్యవేక్షణాధికారి కార్యాలయ కిటికీ అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై ఎస్ఎన్ ముత్యాలరావు తెలిపారు. ఎస్సై కథనం మేరకు నరసాపురం గ్రామీణ పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసులో పోలీసు సిబ్బంది ఈ నెల 16న యల్లమిల్లి సతీశ్‌బాబు, మరో ఇద్దరు నిందితులను న్యాయస్థానానికి తీసుకొచ్చారు. సతీశ్‌బాబు అక్కడ పర్యవేక్షణాధికారి కార్యాలయం కిటికీ అద్దాలను ధ్వంసం చేశాడు. పర్యవేక్షకుడు యు.రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

# అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

## 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

**ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే:** పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను అపహరించిన ముగ్గురు అంతర్రాష్ట్ర నేరగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరులోని ఎస్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పోలీసు శాఖలోని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జిల్లా సరిహద్దుల్లో సంచరిస్తున్న అనుమానితుల కదలికలను ట్రాక్ చేసి ద్విచక్ర వాహనాలు చోరీ చేసే తెలంగాణ రాష్ట్రానికి ముగ్గురు సభ్యుల ముఠాను పట్టుకున్నామన్నారు. గతేడాదిగా వీరు నూజివీడు టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో 6, ఎ.కొండూరు 1, మచిలీపట్నం 1, మైలవరం 2, తిరువూరు 1, ఒంగోలు 1, విజయవాడ కృష్ణలంక 2, సత్తుపల్లి 1, చింతలపూడి స్టేషన్ పరిధిలో ఒక ద్విచక్ర వాహనాలను చోరీ చేశారన్నారు. నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడు టౌన్ సీఐ సత్య శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి నూజివీడు రామన్నగూడెం రోడ్డులోని రాజీవ్ సర్కిల్ వద్ద గురువారం ఓ ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళుతున్న ముగ్గురిని ఆపి విచారణ చేయగా ఈ నేరానికి పాల్పడింది వారేనని తెలిసిందన్నారు.

**నిందితులు వీరే..** ఈ కేసులో నిందితుడిగా ఉన్న తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కల్లూరుకు చెందిన బత్తుల పవన్ కల్యాణ్, సత్తుపల్లిలో బీకాం కంప్యూటర్స్ చదివాడు. అనంతరం చదువు ఆపేసి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మరో నిందితుడు అదే గ్రామానికి చెందిన భీమిరెడ్డి సీతారామరెడ్డి 9వ తరగతి వరకు చదివి మెకానిక్ పనులు చేస్తుంటాడు. మూడో నిందితుడు అదే మండలం దూళ్లకొత్తూరుకు చెందిన దనికొండ రమేష్ కాంట్రాక్టు వర్కరుగా పని చేస్తూ ఓ మద్యం బెల్టు షాపు కూడా నిర్వహిస్తున్నాడు. పవన్ కల్యాణ్, రమేష్ ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. డబ్బులు సులభంగా సంపాదించాలని సీతారామిరెడ్డిని కలుపుకొని చోరీలకు పాల్పడుతున్నారు.

# దిగొచ్చిన నిమ్మ ధర..!



నాణ్యతను బట్టి గురువారం కిలో నిమ్మకాయల ధర రూ.30 నుంచి 50వరకూ ఉందని ఆ వర్తకసంఘం అధ్యక్షులు చక్రపాణి తెలిపారు. ఏలూరు మార్కెట్ యార్డులో నిత్యం 25 నుంచి 30 లారీలు ఎగుమతయ్యేవని, ప్రస్తుతం 5 లారీలు మాత్రమే ఎగుమతి చేస్తున్నామన్నారు. **- ఈనాడు, ఏలూరు**

# ఎస్సై కుమార్తెకు ఆపదంటూ మోసం

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** ఎస్సై కుమార్తెకు అనారోగ్యంగా ఉందని నమ్మబలికి సైబర్ నేరగాళ్లు మొగల్తూరులో దుకాణ యజమానులను గురువారం మోసగించారు. వ్యాపారులు, పోలీసుల కథనం మేరకు.. ఉదయం గుర్తు తెలియని వ్యక్తి పలువురు వ్యాపారుల చరవాణులకు కాల్ చేసి 'నేను ఏఎస్సై భాస్కరరెడ్డిని మాట్లాడుతున్నా.. ఎస్సైగారి కుమార్తె తీవ్ర అనారోగ్యంతో వేరే చోట ఆసుపత్రిలో చేర్పించారు. ఆయనకు నగదు అత్యవసరమైంది. నేను తెలియజేసిన నంబరుకు ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేస్తే తర్వాత మా సిబ్బందితో మీ దుకాణం వద్దకు నగదు పంపిస్తాం' అని సైబర్ నేరగాడు నమ్మబలికాడు. వ్యాపారుల పేరుతో పిలిచి మరీ మాట్లాడటంతో ఇది నిజమే అని నమ్మిన ఒక వ్యాపారి రూ.60 వేలను నేరస్థుడు చెప్పిన నంబరుకు ఫోన్‌పే ద్వారా బదిలీ చేశారు. ఇలా మరికొంతమందికి ఫోన్ చేసి నగదు బదిలీ చేయాలని కోరినట్లు చెబుతున్నారు. నగదు బదిలీ చేసిన వ్యాపారికి అనుమానం వచ్చి పోలీసులకు తెలియజేయడంతో వెంటనే ఎస్సై జి.వాసు అప్రమత్తమయ్యారు. సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాపారులు, మండలంలోని ప్రజలకు 'ఇది నేరగాళ్ల మోసమని, ఎవరికీ ఇలా డబ్బులు పంపించవద్దని' సూచించారు. నగదు బదిలీ చేసిన వ్యక్తి వ్యాపార దుకాణం పోలీస్‌స్టేషన్‌కు పది మీటర్ల దూరంలోనే ఉండటం, ఎస్సై వాసుకు అసలు కుమార్తెలే లేకపోవడం గమనార్హం. ఇలా ఎంతమంది నగదు బదిలీ చేశారో ప్రజలు, వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తెలియజేస్తేనే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# నకిలీ బంగారం కుదవ పెట్టి.. రూ.లక్షలు కాజేసి

## పనిచేస్తున్న కంపెనీకే ఉద్యోగి కుచ్చు టోపీ

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** స్నేహితులు, సిబ్బంది సహకారంతో తాను పనిచేసే కంపెనీకే కుచ్చు టోపీ పెట్టి రూ.లక్షలు కాజేశాడు ఆ ఉద్యోగి. ఉన్నతాధికారుల పరిశీలనలో ఉద్యోగి బండారం బయట పడటంతో సదరు ఉద్యోగితో పాటు సహకరించిన వారు పరారవ్వడంతో చేసేదేమీ లేక కంపెనీ ప్రతినిధులు జంగారెడ్డిగూడెం పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్సై జబీర్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన ఎన్.దుర్గాప్రసాద్ స్థానిక కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో బ్రాంచి మేనేజరుగా కొంత కాలంగా పనిచేస్తున్నారు. అతడితో పాటు అదే ప్రాంతానికి చెందిన టి.నాగబాబు సైతం కంపెనీలో క్యాషియర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే దుర్గాప్రసాద్ తను పనిచేస్తున్న కాలంలో పలు రకాల నకిలీ బంగారు వస్తువులను కంపెనీలో కుదవ పెట్టి రూ.23 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకు కంపెనీ క్యాషియర్ నాగబాబుతో పాటు దుర్గాప్రసాద్ స్నేహితులు ఎన్.శ్రీనివాస్, మురళీ సహకరించారు. కంపెనీ ఏరియా మేనేజరు హేమంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)

(కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 131, 140, 151 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

# బంగారు ఆభరణాల బ్యాగ్ మరిచి వెళ్లిపోయిన మహిళ

**రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే:** రావులపాలెంలో ఓ మహిళ బంగారు వస్తువులతో కూడిన హ్యాండ్‌బ్యాగ్ మరిచిపోయారు. గంట తర్వాత వచ్చి చూసే సరికి లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్‌బాబు తెలిపిన వివరాలిలా.. పెంటపాడుకు చెందిన తాడిగడప సుబ్బలక్ష్మి ఆత్రేయపురంలో ఒక భూమి రిజిస్ట్రేషన్ కోసం రావులపాలెం బస్టాండ్‌కు గురువారం వచ్చారు. అక్కడ బ్యాగ్ మరిచిపోయి ఆటో ఎక్కి ఆత్రేయపురం వెళ్లిపోయారు. తిరిగొచ్చి చూసినా బ్యాగ్ కనిపించలేదు. ఇందులో రెండు కాసుల బంగారు నక్లెస్, కాసు చైను, అరకాసు మాటీలు, 62 తులాల వెండి పట్టీలు, రూ.11 వేలు నగదు ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయంపై ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది.

# భీమవరం

●భీమవరం ●ఉండి

## 68 మందికి ఇళ్ల పట్టాలు


లబ్ధిదారుకు ఇంటి పట్టా ఇస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

**ఆకివీడు, న్యూస్‌టుడే:** స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో 68 మంది పేదలకు ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు చేతులమీదుగా గురువారం ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. స్థానిక ఐయిభీమవరం రోడ్డు తదితర ప్రాంతాల లబ్ధిదారులకు తాళ్లకోడులోని 74 ఎకరాల లేఅవుట్‌లో స్థలాలు కేటాయించారు. కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, పట్టణాధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, కమిషనర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం


విద్యార్థినికి బహుమతి ఇస్తున్న నిర్వాహకులు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ జి.కాళీచరణ్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా భీమవరం, కాళ్ల మండలాల్లోని పలు పాఠశాలల విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్సై నాళం శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**ఉండి, న్యూస్‌టుడే:** స్థానిక 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఏనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామని ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండి, పెదపుల్లేరు, కలిసిపూడి, చినపుల్లేరు, చెరుకువాడ, మహదేవపట్నం, వెలివర్రు, చిలుకూరు తదితర గ్రామాలతోపాటు ఇండస్ట్రియల్, ఆక్వా చెరువులకు సరఫరా ఉండదని... వినియోగదారులంతా గమనించి సహకరించాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**పాలకోడేరు:** గొల్లలకోడేరు విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతులు, 11 కేవీ లైనుపై చెట్ల కొమ్మలు తొలగించనున్నందున.. శుక్రవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. గొల్లలకోడేరు, గరగపర్రు గ్రామాల్లో ఉదయం ఏనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్తు ఉండదని చెప్పారు.

**కొపితివాడ(వీరవాసరం):** కొణితివాడ, వీరవాసరం ఉప కేంద్రాల పరిధిలో శుక్రవారం విద్యుత్తు తీగల మరమ్మతులు చేయనున్నట్లు ఈఈ మధుకుమార్ తెలిపారు. కొణితివాడ, నేలపోగుల, మడుగోపలవరం, బుద్ధరాయుడు చెరువు, గవరపాలెం, నవుదూరు, ఉనికిలి, తోలేరు గ్రామాలకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన చెప్పారు.

## మండల సమావేశం రేపు

**ఉండి, న్యూస్‌టుడే:** స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్.రవీంద్ర తెలిపారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా పాల్గొనాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు.

## అతిసారంపై అవగాహన అవసరం

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లాలో అతిసారం ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. వర్షాకాలం నుంచి వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, నిపుణులైన వైద్యులతో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

☛ భీమవరం పట్టణంలో ఇటీవల కొందరు కత్తులు, ఇనుప రాడ్లతో హల్‌చల్ చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలన్నీ ప్రైవేటు సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. అయితే ప్రధాన మార్గాల్లోని సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో.. వారు ఎటు వెళ్లారో గుర్తించడం కష్టతరంగా మారింది.

☛ భీమవరం రెండో పట్టణం పరిధిలో ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనంలో ఉంచిన రూ.10 లక్షలను గుర్తుతెలియని ఇద్దరు దుండగులు అపహరించుకెళ్లారు. వారిని బాధితుడు వెంబడించినా, ఫలితం లేకపోయింది. నిందితుల ఆచూకీ కనుగొనేందుకు ప్రైవేటు సీసీ కెమెరాలపై ఆధారపడాల్సి వచ్చింది.

☛ భీమవరం ఒకటో పట్టణంలోని ఓ హోటల్ ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనం డిక్కీలోంచి దుండగులు రూ.4 లక్షలు కాజేశారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా.. దొంగలను పట్టుకునేందుకు ప్రైవేట్ సీసీ కెమెరాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

# మూడో కన్ను.. రక్షణ దన్ను!

## భీమవరం కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు


పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

న్యూస్‌టుడే, భీమవరం పట్టణం

భీమవరం పట్టణం నిఘా నీడలోకి చేరింది. ఏ ఏ ఏరియా ఏం జరిగినా క్షణాల్లో గుర్తించేలా సీసీ కెమెరాలు అమర్చారు. తద్వారా పట్టణంలో ఎలాంటి నేరాలు, చోరీలు జరిగినా, నిందితులను త్వరితం పట్టుకునేందుకు అవకాశం ఉండనుంది. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాలు ఎప్పటికప్పుడు వీక్షించేలా ఆయా పోలీసుస్టేషన్లలో వీడియో రికార్డు సిస్టం అమర్చారు.

**నిర్వహణ గాలికి..**

గత తెదేపా హయాంలో గోదావరి పుష్కరాల సందర్భంగా భీమవరం పట్టణమంతా సీసీ కెమెరాలు అమర్చారు. 2019 వరకు భేషుగ్గా పని చేశాయి. వైకాపా అధికారంలోకి వచ్చాక, వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. ఇదే అదనుగా నేరాలు పెరిగాయి. దొంగతనాలు, ద్విచక్ర వాహనాలు, గొలుసు చోరీలు యథేచ్ఛగా సాగాయి. ఆయా కేసులను ఛేదించేందుకు సరైన ఆధారాలు లభించక.. పోలీసులు సైతం ఇబ్బంది పడే వారు. ప్రస్తుతం పట్టణమంతా సీసీ కెమెరాలు అమరుస్తుండటంతో... నేర ప్రవృత్తను తగ్గించేందుకు ఆస్కారం ఏర్పడింది.


ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో వీడియో రికార్డింగ్ వ్యవస్థ

**సిబ్బంది నియామకం..**

నిఘా నేత్రం పనితీరు, సీసీ పుటేజీ నిక్షిప్తం చేసే డిజిటల్ వీడియో రికార్డ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు పోలీస్‌స్టేషన్లలో శిక్షణ పొందిన సిబ్బందిని నియమిస్తున్నారు. సీసీ కెమెరాల పుటేజీని వినియోగంలోకి వస్తే.. దొంగతనాలు, అపహరణలు, హత్య తదితర కేసుల ఛేదించడానికి పోలీసుశాఖకు బాగా ఉపయోగపడతాయి. భీమవరంలో మొత్తం 81 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుండగా-వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చాక ఎస్పీ అద్నాన్ నయాం అస్మి చేతులమీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు.

## వైభవం.. మద్దిరావమ్మ గ్రామోత్సవం


ఊరేగుతున్న అమ్మవారు

**కాళ్ల, న్యూస్‌టుడే:** కాళ్ల గ్రామంలో మద్దిరావమ్మ గురువారం ఊరేగింపు వైభవంగా సాగింది. ఎడ్ల బండిపై అమ్మవారి ప్రతిమ ఏర్పాటు చేసి.. అసాదులు, శక్తి వేష ధారులు సందడి మధ్య జాతర జరిగింది. దారి పొడవునా మద్దిరావమ్మకు భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డీజే పాటలకు యువత నృత్యం చేస్తూ కోలాహలంగా కనిపించారు. మూడేళ్లకోసారి అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

## గోగులమ్మ సన్నిధిలో అన్నసమారాధన


అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన కుంభం

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా మోటుపల్లివారిపాలెంలోని మావుళ్లమ్మ పురిగిడి సమీప గోగులమ్మ ఆలయంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు చేసి అలంకరణ, సహస్ర నామ కుంకుమ పూజలు చేశారు. ఆపై అమ్మవారి ఎదుట భారీ పులిహోర కుంభం వేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు, దాతల సహకారంతో సుమారు 6 వేల మందికి అన్న సమారాధన చేశారు. ఏర్పాట్లను ఆలయ అధ్యక్షుడు మోటుపల్లి చంద్రశేఖర్, కార్యదర్శి మోటుపల్లి నాగసత్యనారాయణ, కోశాధికారి మోటుపల్లి పల్లపురాజు, సభ్యులు పర్యవేక్షించారు.

## వసతి గృహం వద్ద మోత భరించలేకున్నాం!


### న్యాయమూర్తికి బాలికల ఫిర్యాదు


దస్త్రాలు పరిశీలిస్తున్న న్యాయమూర్తి విజయదుర్గ

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భీమవరం బీసీ కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి, సంస్థ ఛైర్‌పర్సన్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న నరసాపురం పదో అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గ పరిశీలించారు. తొలుత బలుసుమూడిలోని శ్రీవెంకటేశ్వర బధిరుల పాఠశాల విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. రాత్రివేళ ఆకతాయిలు ద్విచక్ర వాహనాలతో భారీ శబ్దాలు చేస్తున్నారని, ఆ మోత భరించలేకపోతున్నామని బాలురు విద్యార్థినులు న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆమె ఒకటో పట్టణ పోలీసులను ఆదేశించారు. న్యాయమూర్తి వెంట ప్యానెల్ న్యాయవాదులు కె.జ్యోతి, పి.అంబేడ్కర్, బి.లోకేశ్వరరావు, ఎన్.సుధీర్, డి.రవికిరణ్, ఎం.బి.భవాని తదితరులు పాల్గొన్నారు.

# వెల్లివిరిసిన ప్రతిభ!

## 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భీమవరం ఎస్‌టీ.ఆన్స్ ఐసీఎస్ఈ పాఠశాలలో గురువారం 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం'పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సృజనకు పదును పెట్టారు. ఏనిమిదో తరగతి విద్యార్థినులు బి.మీనాక్షిరెడ్డి(ప్రథమ), ఆర్.చరిత(ద్వితీయ), తొమ్మిదో తరగతి విద్యార్థి కె.హర్షవర్ధన్(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఛైర్మన్ ఎ.విజయకుమార్ వర్మ నేతృత్వంలో ప్రధానోపాధ్యాయుడు జోసెఫ్ బహుమతులు ప్రదానం చేశారు.


విజేతలతో ప్రధానోపాధ్యాయుడు జోసెఫ్

## ప్రపంచ శాంతే ఐరాస లక్ష్యం

**భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే:** ప్రపంచ దేశాల మధ్య సమైక్యత, శాంతి పెంపొందించడమే ఐక్యరాజ్య సమితి పని చేస్తోందని. ఉప ఖజానా శాఖాధికారి అల్లూరి రవివర్మ అన్నారు. స్థానిక కిడ్స్ ఇండియా స్కూలు ప్రాంగణంలో శ్రీవిజ్ఞాన వేదిక, జిల్లా సర్వోదయ మండలి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఐరాస దినోత్సవం నిర్వహించారు. ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని ప్రతిజ్ఞ చేశారు. విజ్ఞాన వేదిక ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కె.రంగరాజు, పి.సూర్యనారాయణ, ఎ.సురేశ్‌కుమార్, సీహెచ్ రంగసాయి, ఇ.ప్రసాదరాజు, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

## 29న సివిల్ సర్వీసెస్ జిల్లా స్థాయి ఎంపికలు

**భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం ఈ నెల 29న తాడేపల్లిగూడెంలో అఖిల భారత సివిల్ సర్వీసెస్ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.రాజేశ్ తెలిపారు. కడకట్ల ఎయిర్ ఫీల్డ్, ల్యాండ్, క్రికెట్ మైదానంలో ఎంపికలు ఉంటాయని, ప్రభుత్వ ఉద్యోగులు హాజరు కావాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# బురద మయం.. ముంపు భయం!

● వెన్నాడుతున్న మురుగు సమస్య ● తీసికట్టుగా పారిశుద్ధ్య నిర్వహణ

**ఆకివీడు, న్యూస్‌టుడే:** ఆకివీడు నగర పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ నానాటికీ తీసికట్టుగా మారుతోంది. సిబ్బంది కొరత, వాహనాల లేమి, పర్యవేక్షణ కరవవడంతో.. చెత్త తొలగింపు, కాలువల శుభ్రత తదితర పనులు సవ్యంగా సాగడం లేదు. ఫలితంగా పలు వార్డుల్లో చెత్త గుట్టలు పేరుకుపోతోంది. మరికొన్నిచోట్ల కాలువల్లో మురుగు ముందుకెళ్లడం లేదు. ఇక చిన్నపాటి వర్షానికే అంతర్గత రహదారులపై వర్షం, మురుగునీరు కలిసి పోయి కాలువల్ని ప్రవహిస్తున్నాయి. వాన తగ్గనానే ఆయా రహదారులన్నీ బురదమయంగా మారుతున్నాయి.


రెడ్డివీధిలో అధ్వానంగా సీసీ రహదారి


సంతమార్కెట్ ప్రాంతంలో రోడ్డుపై ఇలా..

**హోదా మాత్రమే పెరిగింది..**

ఆకివీడుకు నగర పంచాయతీ హోదా వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. నేటికీ ఆ స్థాయిలో అభివృద్ధి మాత్రం జరగడం లేదు. ప్రధానంగా పారిశుద్ధ్యం మెరుగుపడలేదు. క్రమపద్ధతిలో చెత్త సేకరణ, కాలువల్లో పూడిక తొలగింపు తదితరాలు చేపట్టడం లేదు. ఏళ్లుగా పూర్తిస్థాయి శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో... పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేవారే కరవయ్యారు.

**లోతట్టు ప్రాంతాలు జలమయం..**

ఇటీవల దఫదఫాలుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం అవుతున్నాయి. సాలిపేట, సమతానగర్ తదితర నివాసిత ప్రాంత వాసులను ముంపు భయం వెన్నాడుతోంది. కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురవకపోయినా.. కాలువల పొంగి కాలువలు కంపు కొడుతున్నాయి. పారిశుద్ధ్య లోపంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. సిబ్బందితో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా సాగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# తప్పుల తడకగా భూముల రీ-సర్వే

## గ్రామ సభల్లో వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

**కోలమూరు(ఉండి), న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వంలో తప్పులతడకగా చేపట్టిన భూముల రీ సర్వేను తక్షణమే రద్దు చేయాలని తెదేపా సమన్వయ కమిటీ సభ్యుడు పేరిచర్ల బాలరాజు విజ్ఞప్తి చేశారు. కోలమూరులో గురువారం మధ్యాహ్నం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. సర్పంచి నడింపల్లి సత్యవతి అధ్యక్షత వహించారు. బాలరాజు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో ఆయా కట్టు పరిధిలోని కొందరు రైతులు కలిసి తప్పున్న చేపల చెరువులకు ఒకే ఎల్‌పీ నంబరు కేటాయించడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం పాత విధానాన్నే కొనసాగించాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు. సమావేశంలో కోలమూరు నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు కూనపరాజు రాంబాబు, లయన్స్ మాజీ అధ్యక్షుడు రుద్రరాజు నరసరాజు, ఉప సర్పంచి నడింపల్లి రాంబాబు, ఆర్‌వో రేవు కార్తిక్, సర్వేయర్ రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

**వేండ్రలో 18 అర్జీలు..**

**పాలకోడేరు:** భూముల రీ సర్వేలో పొటమేస్తున్న పొరపాట్లను పూర్తిస్థాయిలో సరిచేస్తామని రీ సర్వే ఉప తహసీల్దారు సూర్యనారాయణరాజు అన్నారు. వేండ్ర పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. వివిధ సమస్యలపై రైతుల 18 అర్జీలు అందాయి. సర్పంచి కడలి నాగేశ్వరి, ఉప సర్పంచి సుబ్బరాజు, ఆర్‌ఐ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**వివాదాల పరిష్కారం..**

**తోలేరు(వీరవాసరం):** భూముల రీ సర్వేతో సాగు భూముల విస్తీర్ణంలో వచ్చిన హెచ్చుతగ్గుల సమస్య పరిష్కరించుకునేందుకు రైతులు సహాయ సహకారాలందించాలని ఉప తహసీల్దారు సుబ్బారావు సూచించారు. తోలేరులో గురువారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. వివిధ సమస్యలపై 61 అర్జీలు వచ్చాయి. ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, సర్పంచి వేండ్ర లీలా వెంకటలక్ష్మి, ఆర్‌ఐ రాజ్‌వెల్, సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కోళ్లపర్రులో 14 వినతులు**

**కోళ్లపర్రు:** కోళ్లపర్రు గ్రామ సచివాలయంలో గురువారం భూముల రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. సాగు భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు, ఇతర వివాదాల పరిష్కారానికి రైతులు 14 అర్జీలు అందజేశారు. ఆర్‌ఐ వి.ఆంజనేయులు, వీఆర్వో కె.హనుమాన్ ద్వారకానాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐక్యంతోనే సంఘ పురోగతి

**పాలకోడేరు, న్యూస్‌టుడే:** రజకులు విభేదాలను పక్కన పెట్టి ఐక్యంగా ముందుకు సాగాలని, అప్పుడే పురోగతి సాధ్యమవుతుందని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడక రాజు అన్నారు. గరగపర్రులో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలో సంఘంలో ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించారు. సంఘ నాయకులు యండమూరి నాగేంద్ర, దొడ్డిపట్ల అమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆకివీడు: అవగాహన కల్పిస్తున్న ఎస్సై నాగరాజు

## చోరీలు అరికట్టేందుకు చర్యలు

**ఉండి, న్యూస్‌టుడే:** మండలంలో చోరీలు అరికట్టేందుకు అన్నిరకాల చర్యలు తీసుకున్నామని ఆకివీడు సీఐ జి.జగదీశ్వరరావు అన్నారు. ఉండి ప్రధాన వంతెన కూడలిలో ఎస్సై మహ్మద్ నసీరుల్లాతో కలిసి గురువారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. నంబరు లేని, అనుమానాస్పద వాహనాలను ఆపి దస్త్రాలు క్షుణ్నంగా పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ.. ఇటీవల గొలుసు దొంగతనాలు, నంబరు ప్లేట్లు లేని వాహనాలపై సంచరిస్తున్న నేరాలకు పాల్పడుతోందన్నారు. ఎస్పీ ఆదేశానుసారం విస్తృతంగా వాహనాల తనిఖీ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

**అపరిచితులతో జాగ్రత్త**

**ఆకివీడు:** అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై నాగరాజు సూచించారు. ఆకివీడులోని వివిధ కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ.. దొంగల చిత్రాలు చూపుతూ స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రయాణికులు స్వీయ జాగ్రత్తలు పాటిస్తూ.. నగదు, బంగారు ఆభరణాలు భద్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు.

# గొలుసు దుకాణాలు అరికట్టండి



**ఆకివీడు, న్యూస్‌టుడే:** మండలంలో యథేచ్ఛగా ఏర్పాటవుతున్న గొలుసు దుకాణాలు నియంత్రించాలని ఐద్వా నాయకురాళ్లు డిమాండ్ చేశారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ ఎం.శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. గొలుసు దుకాణాల ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఐద్వా ఆకివీడు పట్టణ కార్యదర్శి ఉదయ్‌కుమారి, దోకల లక్ష్మి, జి.లావణ్య, బి.కల్యాణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చాలి


చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కల్యాణి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం శాఖ మహాసభ నిర్వహించారు. సీహెచ్ వరలక్ష్మి అధ్యక్షత వహించారు. కల్యాణి మాట్లాడుతూ.. నిత్యావసర సరకుల ధరల నియంత్రణ, పేదలకు ఇసుక అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావు మాట్లాడుతూ... అయిదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజల కష్టాలు మాత్రం తీరడం లేదన్నారు. అనంతరం పార్టీ శాఖ మహిళా కార్యదర్శిగా సీహెచ్ వరలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకుముందు పార్టీ నేతలు సీతారాం ఏచూరి, ఆర్.సత్యనారాయణరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రీదేవి, పాలిని, మహాలక్ష్మి, నాగమణి, ఎం.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా బజారులో విక్రయాల జోరు


వివిధ వస్తువులు అమ్ముతున్న మహిళలు

**ఆకివీడు, న్యూస్‌టుడే:** స్థానిక అయిభీమవరం కూడలి ప్రాంతంలో మెప్మా విభాగం ఆధ్వర్యాన గురువారం మెప్మా బజార్(అర్బన్ మార్కెట్) ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విక్రయాలు సాగాయి. ఆకివీడు పట్టణంలోని పలు డ్వాక్రా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్త్రాలు, పచ్చళ్లు, మిఠాయిలు తదితరాలు ప్రదర్శించి విక్రయాలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు తరలివచ్చి.. వివిధ వస్తువులు కొనుగోలు చేశారు.

## రాజీయే రాజమార్గం

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** రాజీయే రాజ మార్గమని లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని తణుకు 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవతి సూచించారు. రాష్ట్ర న్యాయ సేవల సంస్థ ఆదేశాల ప్రకారం, ఏలూరు జిల్లా న్యాయమూర్తి ఆదేశాలతో జిల్లాలో కోర్టు ఉన్న ప్రతిచోటా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వంతెన.. ప్రమాదపుటంచున!




గరగపర్రు శివారు ఉప్పరిగూడెం వెళ్లే మార్గంలో పంటకాలువపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. కొన్నిచోట్ల వారధి రక్షణ గోడలు దెబ్బతినడంతో... రాత్రివేళ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వంతెన మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శి లక్ష్మీ తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకోడేరు

## మురుగు కదలక.. సమస్య తీరక!



లిక్కోడు కాలువలో అల్లుకుపోయిన తూడు, గుర్రపుడెక్క, ఇతర చెత్తాచెదారాలు మురుగునీటి ప్రవాహానికి అవరోధాలుగా మారాయి. ఉండి, ఉప్పుగుంట, కలిసిపూడి, రామాపురం, పాములపర్రు తదితర ప్రాంతాల్లోని సుమారు 5 వేల ఎకరాల్లోని వరి చేలు, చేపలు, రొయ్యల చెరువుల్లోని మురుగునీరంతా వివిధచోట్ల తెలిక్కోడులో కలుస్తుంది. దీన్ని ప్రక్షాళన చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. కాలువను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మురుగునీటి పారుదల శాఖ ఏఈ జయప్రకాశ్ తెలిపారు. - న్యూస్‌టుడే, ఉండి

## పరిశీలించరు.. సరి చేయరు!



గరగపర్రు నుంచి ఉప్పరిగూడెం, చేరుగూడెం వెళ్లే రహదారిలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్తు తీగలను పరిశీలించి, వాటిని సరిచేస్తామని పాలకోడేరు ఏఈ తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకోడేరు

## భీమవరం సినిమా

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

| | |
|---|---|
| శ్రీపద్మాలయ స్క్రీన్ 1 | వేట్టయన్ |
| శ్రీపద్మాలయ స్క్రీన్ 2 | దేవర |
| కిషోర్ స్క్రీన్ 1 | విశ్వం |
| కిషోర్ స్క్రీన్ 2 | లగ్గం |
| నటరాజ్ | వెనమ్ దిలాస్ట్ డాన్స్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1 | వెనమ్ దిలాస్ట్ డాన్స్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2 | సత్యం సుందరం |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3 | శ్వాగ్ |
| ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4 | దేవర |
| విజయలక్ష్మి స్క్రీన్ 1 | ఎంత పనిచేశావ్ చంటి |
| మహాలక్ష్మి స్క్రీన్ 2 | పొట్టేల్ |

నరసాపురం
• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

## రవాణాశాఖ అధికారుల తనిఖీ



**మొగల్తూరు, న్యూస్‌టుడే:** నియోజకవర్గంలోని మొగల్తూరు, నరసాపురంలలో 216 జాతీయ రహదారిపై రవాణా శాఖ అధికారులు గురువారం వాహన తనిఖీ చేశారు. వాహన, డ్రైవింగ్ పత్రాలు లేని, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేశారు. పలువురికి అపరాధ రుసుము విధించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ వెంకటరమణ, కేఎస్ఎన్ ప్రసాద్, ఎన్ఎల్ఎస్ లక్ష్మి, ఎం.రవికుమార్, ఫణితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు సేవల పునరుద్ధరణ

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** మొగల్తూరుకు ఆర్టీసీ బస్సు సేవలు గురువారం పునరుద్ధరించారు. గ్రామంలో పాతకాలువ ప్రాంతం నుంచి పెదపల్లవపాలెం వరకు జాతీయ రహదారి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆరు నెలల కిందట రహదారి పునర్నిర్మాణం చేపట్టారు. అప్పటినుంచి గ్రామంలోకి బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఇతర ప్రాంతాలకు ప్రైవేటు వాహనాలపై రాకపోకలు సాగించే ప్రజలు ఆటోలు లేదా జాతీయ రహదారికి వెళ్లి అక్కడనుంచి బస్సుల్లో వెళ్లాల్సి వచ్చింది. గాంధీబొమ్మ కూడలి ప్రాంతంలో వ్యాపార దుకాణాలకు కొనుగోలు దారులు లేక వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సు సేవలు పునరుద్ధరించాలని ప్రజలు పలు పర్యాయాలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించారు. ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు స్పందించి సేవలు పునరుద్ధరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఆహారం

**ఆచంట, న్యూస్‌టుడే:** రైతులు పెట్టుబడులు తగ్గించుకుని, ఆరోగ్యకరమైన ఆహారం అందించడానికి ప్రకృతి వ్యవసాయం దోహదపడుతోందని శాస్త్రవేత్తలు తెలిపారు. మార్టేరు వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో కలిసి గురువారం ఆచంటలో క్షేత్ర పరిశీలన చేశారు. గ్రామంలో రైతు చిలుకూరి విశ్వేశ్వరరావు, సత్యవతి దంపతులు గో ఆధారిత వ్యవసాయం చేస్తున్నారు. ఆవు పుల్ల మజ్జిగ, జీవామృతం, పంచగవ్యాలను వాడుతూ అధిక దిగుబడులు ఎలా సాధిస్తున్నదీ వివరించారు. శాస్త్రవేత్తలు ఎండీ కృష్ణాజి, వై.సునీత, కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం నుంచి ఎ.సిద్ధికి, వీరయ్య చౌదరి, సురేష్, ఉదయ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# సేవలు సరే...అవగాహనేదీ..?

**పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** క్షయ వ్యాధికి సంబంధించిన వైద్య పరీక్షలు, సేవలు అందుబాటులోనే ఉన్నా గ్రామస్థాయిలో రోగులకు అవగాహన లేకుండా పోయింది. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 361 మంది క్షయ బాధితులకు ఉన్నారు. వారు ఆసుపత్రికి వచ్చి ఎక్కడబడితే అక్కడ దగ్గుతుండటంతో చిన్నచిన్న వ్యాధులతో అక్కడికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టకుండా కేవలం మందులతో సరిపెట్టారు. దీంతో క్షయవ్యాధి పీడితులు పెరిగిపోయారు.

| గత నాలుగు సంవత్సరాలుగా వివరాలు ఇలా.. | | |
|---|---|---|
| సంవత్సరం | పరీక్షలు | బాధితులు |
| 2021 | 4640 | 421 |
| 2022 | 4850 | 412 |
| 2023 | 5480 | 477 |
| 2024 ఇప్పటి వరకు | 4970 | 361 |

### పెరుగుతున్న బాధితులు

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో యలమంచిలి, దొడ్డిపట్ల, మేడపాడు ప్రాథమిక కేంద్రాలతోపాటు పాలకొల్లు అర్బన్ హెల్త్ సెంటర్, పాలకొల్లు ఏరియా ఆసుపత్రుల్లో క్షయ వ్యాధి పీడితులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా ఆసుపత్రులకు 30 నుంచి 40 వరకు సోమ, శుక్ర వారాల్లో 50 మంది వరకు బాధితులు వస్తారు. బరువు చూసి కఫం పరీక్ష, ఎక్స్‌రే చేస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి ఔషధాలు అందజేస్తారు. వ్యాధి సోకినవారికి రాత్రి చెమటతో కూడిన జ్వరం, కఫంతోపాటు దగ్గు, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. వీరు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. కుటుంబ సభ్యులకు దగ్గరగా ఉండకూడదు. వేడినీళ్లు తాగుతూ పౌష్టికాహారం తీసుకోవాలి. ధూమపానం, మద్యపానం చేయకూడదు.



పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

### సిబ్బంది నిర్లక్ష్యం

బాధితుల ఇళ్లవద్దకు వెళ్లి పరీక్షలు నిర్వహించి చరవాణిలో వారి ఆరోగ్య వివరాలు సిబ్బంది నమోదు చేయాల్సి ఉంటుంది. వ్యాధి లక్షణాలు ఏ స్థాయిలో ఉన్నాయో వారికి చెప్పి చికిత్స విధానంపై అవగాహన కల్పించాలి. కానీ ఇలా చేయకపోవడంతో వారి సంఖ్య పెరుగుతోంది. 6 నెలల్లో తగ్గాల్సిన ఈ రోగాన్ని ముదరబెట్టి 9 నెలలు వాడాల్సిన పరిస్థితి తెచ్చుకుంటున్నారు. వ్యాధి లక్షణాలు కలిగిన వారికి పౌష్టికాహారం తీసుకొనేలా ప్రతి నెలా రూ.500 చొప్పున 6 నెలలపాటు ప్రభుత్వ సాయం అందజేస్తుంది.

### ఆరు నెలల కోర్సు వాడాలి

ఎక్కువమంది సాధారణ దగ్గుగా భావించి తీవ్రత పెరిగిన తరువాత ఆసుపత్రికి వచ్చేవారు. ఇప్పుడు నమూనాలు ఎక్కువగా సేకరించి వ్యాధి నిర్ధారణ చేస్తున్నాం. కొంతమంది 6 నెలల కోర్సు మందులు వాడకుండా వ్యాధి ముదరబెడుతున్నారు. రోగులకు అవగాహన కల్పించి వైద్యం అందజేస్తున్నాం. **- ఎ.ప్రతాప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు**

10 AM to 1 PM
**మేమున్నాం.. మీకు తోడుగా..**
**నరసాపురం: 80085 74504**
**పాలకొల్లు: 80085 74510**
**ఆచంట : 91212 29087**

**పెనుగొండ, న్యూస్‌టుడే**

**సమస్య:** మునమర్రులోని పలు వీధుల్లో దోమల తీవ్రత ఎక్కువగా ఉంది. దోమల నివారణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. **-ఎస్.ప్రసాద్, మునమర్రు**

**సమాధానం:** దోమల మందు పిచికారీ చేయిస్తాం. **-సీహెచ్‌ఎస్వీ రెడ్డి, ఈవోపీఆర్డీ, పెనుగొండ మండలం**

**ఆచంట, న్యూస్‌టుడే**

**సమస్య:** ఆచంటలో పాఠశాలల వద్ద చెత్త వేస్తున్నారు. చర్యలు తీసుకోవాలి. **- డి.ప్రసాద్ ఆచంట**

**సమాధానం:** పాఠశాల వద్ద చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- నాగబాబు, కార్యదర్శి, ఆచంట**

## మూతల ఏర్పాటు



**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే:** కొప్పర్రు ప్రధాన రహదారి చెంత రక్షిత మంచినీటి పైపు లైన్ సంప్‌పై మూతలు వేయకుండా వదిలేయడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి ఉంది. ఈ సమస్యను ఈ నెల 23న 'మేమున్నాం..మీకు తోడుగా' దృష్టికి తీసుకురాగా 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీనికి గ్రామ కార్యదర్శి బి.ఆనందబాబు స్పందించి పైపులైన్ సంప్‌పై సిమెంట్ మూతలు వేయించేందుకు చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులతో పాటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్పందనకు స్పందన

## ఉపాధి గ్రామ సభ

**పోడూరు, న్యూస్‌టుడే:** పెనుమదం గ్రామంలో గురువారం గ్రామ సర్పంచి తానేటి బాబూరావు అధ్యక్షతన ఉపాధి హామీ పథకం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై చర్చించి పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మసిపల్లి శ్రీధర్, తెదేపా గ్రామ అధ్యక్షుడు కడలి అంజనేయులు, ఉపాధి పథకం టీఏ కోట బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయండి

**పెనుగొండ, న్యూస్‌టుడే:** గ్రామాభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పెనుగొండ సర్పంచి నక్కా శ్యామలాసోని తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన ఉపాధిహామీ పథకం గ్రామసభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు, వార్డు సభ్యులు, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 486 పనులు గుర్తింపు

**పోడూరు, న్యూస్‌టుడే:** పోడూరు మండలంలోని 9 గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామ సభల ద్వారా 486 పనులను గుర్తించినట్లు పథకం టీఏ కోట బాబూరావు తెలిపారు. రూ.1.46 లక్షలతో చేపట్టేందుకు ఈ పనులకు గ్రామ పంచాయతీల తీర్మానాలు తీసుకున్నామని తెలిపారు.

# కలగంపూడిలో రెవెన్యూ సదస్సు

**యలమంచిలి, పెనుగొండ గ్రామీణ, ఆచంట, న్యూస్‌టుడే:** మండలంలోని కలగంపూడిలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. రైతులనుంచి వివిధ భూసమస్యలపై 12 అర్జీలు అందాయి. డిప్యూటీ తహసీల్దార్ డేవిడ్‌సన్, సర్పంచి పొత్తూరి విష్ణుప్రియ, నాయకులు పాల్గొన్నారు. ● గత ప్రభుత్వ హయాంలో చేసిన భూ సర్వేను రద్దు చేసి పాత పద్ధతికే కొనసాగించాలని రైతులు డిప్యూటీ తహసీల్దార్ డి.రాజేష్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని నడిపూడి గ్రామంలో గురువారం భూ సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. సభలో మొత్తం 40 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి కడలి జెబీ అన్నపూర్ణ, ఎంపీటీసీ సభ్యురాలు మామిడిశెట్టి కన్నమ్మ, వీఆర్వో వెంకటరావు, రైతులు, అధికారులు పాల్గొన్నారు. ● ఆచంట మండలం కందరవల్లిలో రీసర్వే గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి 23 అర్జీలు వచ్చాయి. రీసర్వే డీటీ రాజ్యలక్ష్మి, ఆర్ఐ జయలలిత, సర్పంచి బి.బుల్లియ్య, వీఆర్వో బాలాజీ, కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

## నేడు చెత్తశుద్ధి కేంద్రం ప్రారంభం

**నరసాపురం, న్యూస్‌టుడే:** నరసాపురం వశిష్ఠ గోదావరి గట్టుపై ఉన్న డంపింగ్ యార్డులో ఏర్పాటుచేసిన చెత్త శుద్ధి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభిస్తామని, దీనికి అవసరమైన ఏర్పాట్లు చేశామని కమిషనర్ యం.అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డంపింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు.



చెత్తశుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న అంజయ్య

# సృజనకు పదును

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభాపాటవ పోటీలు

**పాలకొల్లు పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును పెట్టడానికి ప్రతిభాపాటవ పోటీలు దోహదపడతాయని పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎం.రాంప్రసాద్ అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక ఉల్లంపర్రు మాంటిస్సోరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బి.జెబీ, ఎ.లావణ్య, ఎం.హిమశ్రీ నిలిచారు. విజేతలకు రాంప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎం.ఎస్.వాసు, ప్రిన్సిపల్ ఎస్.వసంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ ఎస్.ఉషాకుమారి పాల్గొన్నారు.



వ్యాసరచన చేస్తున్న విద్యార్థులు



విజేతలతో కరస్పాండెంట్ రాంప్రసాద్ తదితరులు

## యూటీఎఫ్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు

**యలమంచిలి, న్యూస్‌టుడే:** యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా సంఘ యలమంచిలి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాథమిక స్థాయిలో అయిదో తరగతి వరకు ఒక విభాగం, ప్రాథమికోన్నత స్థాయిలో 6, 7, 8 తరగతులకు రెండో విభాగంలో పోటీలు జరుగుతాయని జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి తెలిపారు. ప్రతి గ్రామంలో విద్యార్థులు సమీపంలోని ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం ఒంటి గంటకు పోటీలకు హాజరవ్వాలన్నారు.

## డ్వాక్రా సభ్యులకు ప్రభుత్వ సహకారం

**నరసాపురం, న్యూస్‌టుడే:** డ్వాక్రా గ్రూపుల సభ్యుల ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు సద్వినియోగం చేసుకోవాలని పురపాలక సంఘ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశాల మేరకు పట్టణంలోని 29వ వార్డులో నివసిస్తున్న యానాదుల సామాజిక వర్గ మహిళలతో గురువారం డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రూపుల ద్వారా సమకూరే లబ్ధి గురించి వివరించారు. అనంతరం 27వ వార్డులో పర్యటించారు. ఆయా కార్యక్రమాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కిశోర్, మెప్మా సిటీమిషన్ మేనేజరు మోహన్, సీవో సత్యనారాయణ, గోరు సత్తిబాబు తదితరులు ఉన్నారు.

# నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

**పెనుగొండ, గ్రామీణ, మార్టేరు, నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే:** పెనుగొండ మండల పరిధిలో పెనుగొండ, తామరాడ, రామన్నపాలెం, దొంగరావిపాలెం గ్రామాల్లో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. ● పెనుమంట్ర మండలంలోని మార్టేరు, ఆలమూరు, పెనుమంట్ర విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో నిర్వహణ పనుల రీత్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తామని ఈఈ తెలిపారు.

● పోడూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల రీత్యా పోడూరు, పండితవిల్లూరు, తూర్పుపాలెం, కుమ్మరిపాలెం, కవిటం లాకులు, జగన్నాథపురం, కవిటం, వేడంగి, వేడంగిపాలెం, మట్టపర్రు గ్రామాలతో పాటు పరిశ్రమల ఫీడర్ పరిధిలో వినియోగదారులకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఈఈ చెప్పారు.

● నరసాపురం పట్టణం పుష్కరఘాట్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని మెయిన్‌రోడ్డు, వైఎన్సీ, పాతబజారు, పార్కురోడ్డు, శారదా థియేటర్, చర్చిరోడ్డు, పంజా సెంటరు, మిషనరీ హైస్కూలు రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, కొత్తకాలనీ, పీచుపాలెం, చల్లాలమ్మ ఆలయం ప్రాంతాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేయనున్నారు. ● మొగల్తూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధి కొత్తపాలెం, శేరేపాలెం, నక్కావారిపాలెంలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు. ● నరసాపురం గ్రామీణ మండలం సీతారామపురం, రాజుగారితోట, యర్రంశెట్టివారిపాలెం, మండవారిపేట, మంగళగుంటపాలెం, రుస్తుంబాద, లింగబోయినచర్ల, పసలదీవి, తూర్పుతాళ్లు, రాజుల్లంక, వేములదీవి, సర్దుకొడప, కాపులకొడప, బియ్యపుతిప్ప, మర్రితిప్ప, దర్బరేవు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని ఈఈ తెలిపారు.

# పొలంగట్టున సాగు పాఠాలు!

● సేంద్రియ సేద్యం వైపు రైతుల అడుగులు
● అన్నదాతలకు అండగా 'పొలం పిలుస్తోంది'

**పాలకొల్లు సాంస్కృతికం, పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే:** వ్యవసాయ రంగంలో రైతులు ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక ఆర్థిక ఇబ్బందులు షరామామూలే. ఖర్చుల భారం నుంచి బయటపడటం అన్నదాతలకు కత్తి మీద సాములా తయారయ్యింది. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగానే వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలాన్ని ఒక క్షేత్రంగా ఎంపిక చేస్తున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొంటున్నారు. మేలైన దిగుబడులను సాధించేందుకు తీసుకోవల్సిన చర్యలను రైతులకు తెలియజేస్తున్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (పాత చిత్రం)

### నాణ్యమైన దిగుబడులు

పాలకొల్లు డివిజన్‌లో 17,568 ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా 1500 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఇందులో యలమంచిలి మండలంలో 600, పాలకొల్లు మండలంలో 900 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పంటల ఆరంభ దశ నుంచి కోతకు చేరుకునే వరకు నాణ్యమైన దిగుబడులు సాధించడమే లక్ష్యంగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. సేంద్రియ ఎరువులను తయారు చేసి వినియోగించడంతో పాటు తెగుళ్ల నివారణకు పలు జీవామృతాలు స్వయంగా తయారు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.

### తక్కువ పెట్టుబడులతో..

సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నా. మంచి దిగుబడులు వస్తున్నాయి. ఆరోగ్యకరమైన పంటలను పండించాలనే ఉద్దేశంతో ఈ పద్ధతిలో సాగు చేస్తున్నా. తక్కువ పెట్టుబడులతో మేలైన, అధిక దిగుబడులు వస్తుండటంతో ఈ ఒరవడిని కొనసాగిస్తున్నా. **-విజయరామరాజు, రైతు, వాలమర్రు**

### ప్రయోగాత్మకంగా..

ప్రయోగాత్మకంగా సేంద్రియ సాగు విధానాన్ని ప్రారంభించా. చీడ పీడల నివారణకు కషాయాలను తయారు చేసి పిచికారీ చేస్తున్నా. కాలానుగుణంగా ఆరోగ్య సంరక్షణకు పెద్ద పీట వేస్తూ ఈ సాగు వైపుకు మళ్లాను. **- సాల్మాన్ రాజు, రైతు, కాపవరం**

## నేటితో ముగియనున్న శిక్షణ తరగతులు

**మార్టేరు, న్యూస్‌టుడే:** మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సమగ్ర సస్యరక్షణ- మానవ వనరులు సంరక్షణ అంశంపై అయిదు రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగియనున్నాయి. నాలుగో రోజు గురువారం పలు అంశాలపై శాస్త్రవేత్తలు వివరించడంతో పాటు క్షేత్రసందర్శన చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్, విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎంవీ.కృష్ణాజీ, తదితరులు పాల్గొన్నారు.

## అన్నసమారాధన

**మార్టేరు, న్యూస్‌టుడే:** దసరా మహోత్సవాల ముగింపులో భాగంగా మార్టేరు శివరావుపేటలోని శ్రీకనక దుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు.

# పనులు పూర్తయ్యేది ఎప్పుడో?

**వడలి(పెనుగొండ), న్యూస్‌టుడే:** మేజర్ పంచాయతీ వడలిలో రెండు సచివాలయ భవనాలు అసంపూర్తిగా నిలిచాయి. గత వైకాపా ప్రభుత్వంలో చేపట్టిన ఈ పనులు మూడు సంవత్సరాలు దాటినా నేటికీ పూర్తికాలేదు. మండలంలో 20 సచివాలయాలున్నాయి. 13 చోట్ల చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇందులో వడలి-1లో రూ.40 లక్షలు, వడలి-2 రూ.35 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టారు. పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో సిబ్బంది స్థానిక పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు గదుల్లో, చాలీచాలని వసతులతో విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యాలయ భవనం బీటలు వారడంతో బిక్కు బిక్కు మంటూ సేవలు అందిస్తున్నారు. పంచాయతీరాజ్ డీఈ ఎన్.కృష్ణమూర్తిని సంప్రదించగా భవన నిర్మాణ పనులు పూర్తి చేసి రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.



వడలిలో అసంపూర్తిగా సచివాలయ భవనం



పంచాయతీ కార్యాలయంలోని ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

## ప్రణాళికాబద్ధంగా పనులు చేయండి

**పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే:** గ్రామాల్లో ప్రణాళికబద్ధంగా పనులు జరిగేలా చూడాలని నరసాపురం డీఎల్పీవో జ్యోతిర్మయి అన్నారు. పాలకొల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పాలకొల్లు, యలమంచిలి, ఆచంట, నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలకు శుద్ధిచేసిన నీరు అందించాలన్నారు. వాటర్ ట్యాంకులను నెలకు రెండు సార్లు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారులు, మండలస్థాయి కంప్యూటర్ ఆపరేటర్లు, డివిజనల్ కార్యాలయ ఏవో పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జ్యోతిర్మయి



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి

## ఆకస్మికంగా తనిఖీ

**పెనుగొండ, న్యూస్‌టుడే:** విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందించాలని ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం వడలి పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

## పోలియో నిర్మూలనే లక్ష్యం

**పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే:** పోలియో నిర్మూలన రోటరీ లక్ష్యం అని అధ్యక్షుడు రావాడ సతీష్ అన్నారు. ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉల్లంపర్రులోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, కార్యదర్శి జివ్వాజి కల్యాణ్, పొత్తూబత్తుల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.




ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, సభ్యులు

## నేటి నుంచి పశుగణన వివరాల సేకరణ

**నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే :** అఖిల భారత పశుగణన కార్యక్రమం సందర్భంగా ఈ నెల 25 నుంచి 28 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పశుగణన కార్యక్రమం నిర్వహిస్తామని మండల పశు సంవర్ధక శాఖ అధికారి ఇంజేటి సురేంద్ర తెలిపారు. మండలంలోని 14 రెవెన్యూ గ్రామాల్లో 8 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి పశుగణన వివరాలు సేకరిస్తారన్నారు. పశు యజమానులు సమగ్ర సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# పట్టణ రహదారులు ఛిద్రం

**నరసాపురం, న్యూస్‌టుడే:** నరసాపురం పట్టణంలో రహదారులు ఛిద్రమయ్యాయి. దీంతో ఇంట్లోనుంచి బయటకు అడుగుపెట్టాలంటే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేసి పుష్కరకాలం పూర్తయ్యింది. గోదావరికి పుష్కరాల సమయంలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధికి అంతంత మాత్రంగా నిధులు కేటాయించింది. దీంతో రహదారులన్నీ ఛిద్రమయ్యాయి. పట్టణంలోని పార్కు రోడ్డు, మిషన్ హైస్కూలు రోడ్డు, రుస్తుంబాదలోని 216 జాతీయ రహదారి నుంచి జగన్నాథస్వామి ఆలయం వరకు ఉన్న మార్గాలు దారుణంగా తయారయ్యాయి. ప్రజలు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిసిన సమయంలో ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. ఈ సమస్యను 'న్యూస్‌టుడే' పురపాలక సంఘ కమిషనర్ ఎం.అంజయ్య దృష్టికి తీసుకెళ్లగా కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.




పార్కు వీధిలో మరమ్మతులకు గురైన దారి



రుస్తుంబాదలో గుంతలతో ఇలా..

# చేలల్లో కలువలు.. కర్షకులకు కన్నీళ్లు

**మొగల్తూరు, న్యూస్‌టుడే:** పొలం గట్టుకెళ్లేసరికి పచ్చని పైరు రెపరెపలాడాల్సిన చేలల్లో కలువ పూలు వికసించడంతో వాటిని చూసి అన్నదాతల గుండె చెరువవుతోంది. కొన్నేళ్లుగా మురుగు, సాగునీటి వనరుల వ్యవస్థ ప్రక్షాళన చేయలేదు. దీంతో నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాల్లోని చేలల్లో వర్షాకాలం ఆరంభం నుంచీ మొలలోతు నీరు నిలిచే ఉంది. వాటిలో కలువపాదులు పెరిగి పూలు వికసిస్తూ మడుగులను తలపిస్తున్నాయి. ముంపు ఇబ్బందులతో నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని మూడు వేల ఎకరాల్లో సార్వాసాగు చేయలేదు. సుమారు 2 వేల ఎకరాల్లో వరినాట్లు వరదల ప్రభావంతో ముంపుబారినపడ్డాయి. వాటన్నింటిలోనూ ఇదే పరిస్థితి. త్వరలో దాళ్వాసాగుకు సన్నద్ధం కావాల్సి ఉంది. చేలల్లో పెరిగిన కలువపాదులు తొలగించేందుకు వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## జూద శిబిరంపై దాడి

**ఆచంట, న్యూస్‌టుడే;** ఆచంట మండలం శేషమ్మచెరువు గ్రామ పరిధిలో జూద శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై కె.వెంకటరమణ గురువారం తెలిపారు. 11 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.24500 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తాడేపల్లిగూడెం
• తాడేపల్లిగూడెం • తణుకు

## గ్రామాభివృద్ధికి సహకరించండి

**పెంటపాడు, న్యూస్‌టుడే:** గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచి తాడేపల్లి సూర్యకళ అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, ప్రజా సమస్యలపై గురువారం పెంటపాడు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి సూర్యకళ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఎస్సీకాలనీలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, కమ్యూనిటీ హాలు నిర్మించాలంటూ పలువురు కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. సర్పంచి సూర్యకళ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో దేశనాయకుల విగ్రహాల ఏర్పాటుకు, సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారన్నారు. ప్రణాళికాబద్ధంగా గ్రామ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. వార్డు సభ్యులు వినోద్‌రెడ్డి, విప్పర్తి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గొడి బాల కృష్ణ, ఎన్డీయే నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## అయోడిన్ ఉప్పునే వాడాలి

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** అయోడిన్ ఉప్పు వాడటం వల్ల హైపోథైరాయిడ్, బుద్ధిమాంద్యం బారిన పడకుండా ఉండొచ్చని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు, తిరుపతిపురం సెక్టార్ పర్యవేక్షకులు మేకా శ్రీదేవి అన్నారు. గురువారం అత్తిలి మండలం శివపురం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణి, బాలింతలకు అయోడిన్ ఉప్పు వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రాజీయే రాజమార్గం


మాట్లాడుతున్న న్యాయమూర్తి సత్యవతి

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** రాజీయే రాజ మార్గమని లోక దాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని తణుకు 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యవతి సూచించారు. రాష్ట్ర న్యాయసేవల సంస్థ గుంటూరు ఉత్తర్వుల ప్రకారం, ఏలూరు జిల్లా న్యాయమూర్తి ఉమ్మడి జిల్లాలో కోర్టు ఉన్న ప్రతిచోటా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సమాచారం కోసం పోలీసు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

## కౌలు రైతులకు అండగా ఉంటాం

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** కౌలు రైతులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రత్యేక కమిషనర్ బి.రాజశేఖర్ అన్నారు. గురువారం ఆయన అమరావతి నుంచి జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ, ఉద్యాన అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకర్ల సహకారంతో కౌలు రైతులకు అవసరమైన రుణాలు మంజూరు చేస్తామన్నారు. పంట సాగు హక్కు పత్రంపై అంగీకారం తెలిపిన భూయజమానులకు పంట రుణాలు మంజూరు చేయించేపోతే కౌలు రైతులకు అందేలా చూస్తామని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ వెట్రి సెల్వి, జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు వనంలో వికసించిన ప్రతిభ

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే**



వారంతా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులే. పాఠశాలలో మైదానం లేకపోయినా, సదుపాయాలు అంతంత మాత్రంగానే ఉన్నా.. . క్రీడలపై ఆసక్తితో నిత్య సాధన చేస్తూ కబడ్డీలో రాణిస్తున్నారు. ప్రధానోపాధ్యాయిని వెంకటలక్ష్మి ప్రోత్సాహంతో, వ్యాయామోపాధ్యాయుడు రవి ప్రత్యేక శ్రద్ధ వహించి కబడ్డీలో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నారు. తరగతుల అనంతరం, సెలవు దినాల్లో కూడా తర్ఫీదు ఇస్తూ.. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మెరిసేలా తీర్చిదిద్దుతున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఏలూరులో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. త్వరలో బాపట్ల, అన్నమయ్య జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు ఈ విద్యార్థులు.

### వ్యాయామ ఉపాధ్యాయినిగా సేవలందిస్తా



నాన్న పెయింటర్‌గా పని చేస్తుంటారు. తల్లి గృహిణి. కబడ్డీపై ఆసక్తి పెంచుకున్నా. లెఫ్ట్ బ్లాక్‌గా ప్రత్యేకత చూపుతున్నా. గత ఏడాది నిర్వహించిన పోటీల్లో పాఠశాల, జిల్లా స్థాయిలో ఆడి రాణించా. ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో అండర్-14 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపా. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణిస్తా. వ్యాయామ ఉపాధ్యాయినిగా సేవలందిస్తా.

-తంగెళ్ల అనూష, ఎనిమిదో తరగతి, మహాలక్ష్మిచెరువు

### సివిల్స్ సాధించడమే లక్ష్యం



నాన్న వ్యవసాయ కూలీ. కబడ్డీ ఆడటం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకున్నా. ఆరో తరగతి నుంచే రైట్ బ్లాక్‌గా ప్రావీణ్యం సంపాదించా. గత ఏడాదిలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించా. ఎస్‌జీఎఫ్ అండర్-14 విభాగంలో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యా. సివిల్స్ సాధించడమే లక్ష్యం.

- జంగా అనుపమ, ఎనిమిదో తరగతి కొమరవరం

### సర్కారు కొలువు సాధిస్తా



మాది మధ్య తరగతి కుటుంబం. బాగా చదివించాలనే ఉద్దేశంతో నాన్న ఇతర దేశాల్లో పని చేస్తున్నారు. ఆరో తరగతి నుంచే కబడ్డీ ఆడుతున్నా. పాఠశాల స్థాయిలో జోనల్స్, శృంగవృక్షంలో అండర్-17 కేటగిరిలో జిల్లా స్థాయిలో రైట్ కార్నర్‌గా ఆడి రాణించాను. ఏలూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్-17 విభాగంలో ప్రతిభ చూపి, జిల్లా జట్టుకు అర్హత సాధించా. సర్కారు కొలువు సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళ్తా.

-బొంతా నిఖిత, పదో తరగతి, కొమరవరం

### పోలీస్‌శాఖలో ఉద్యోగం పొందాలని..



నాన్న పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో రైట్ కార్నర్‌గా ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా. నవంబరులో అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాను. ఇటీవల ఏలూరులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌లో అండర్-17 విభాగంలోనూ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించా. పోలీస్ శాఖలో ఉన్నత కొలువు సాధించాలన్నదే లక్ష్యం.

-తంగెళ్ల అనీష, ఎనిమిదో తరగతి, మహాలక్ష్మిచెరువు

## పీఎంపీల సేవలు అభినందనీయం


మందులు పంపిణీ చేస్తున్న ఎస్సై సూర్యభగవాన్

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** అమరులైన పోలీసుల సేవలను గౌరవిస్తూ ఏటా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న పీఎంపీల సేవలు అభినందనీయమని చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్ అన్నారు. పోలీసు అమరల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎంపీ అసోసియేషన్ ఉంగుటూరు మండల శాఖ, యర్రమిల్లిపాడు పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 200 మందికి గుండె, కంటి, కీళ్లు, నరాల సమస్యలకు సంబంధించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు, ఉప సర్పంచి చిలుకూరి రాజేష్, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొచ్చెర్లకోట శ్రీనివాస్, బీఎస్‌బీ రాజు, ఉపాధ్యక్షుడు మంగన్న పాల్గొన్నారు.

## యాప్‌లో వివరాలు నమోదు చేయండి



మాట్లాడుతున్న ఎంఈవో జ్యోతి

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే :** పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశస్త యాప్‌పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు హనుమ, జ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల వివరాలను యాప్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాలు శుభ్రం చేయాలి

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణ పరిధిలోని ప్రైవేట్ ఖాళీ స్థలాలను యజమానులు శుభ్రం చేసుకోవాలని కమిషనర్ ఏసుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లేని పక్షంలో ప్రజారోగ్య చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖాళీ స్థలాలు దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయన్నారు. దీంతో పుర ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. స్థల యజమానులు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని పాతూరు విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహాలక్ష్మినగర్, తితిదే కల్యాణ మండపం, గుణ్ణం వీధి, పాతూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని వెల్లడించారు.

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** మోదుగగుంట, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, జగన్నాథపురం, ఆరుగొలను, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం గ్రామాల్లో 11 కేవీ లైన్ వార్షిక మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని తాడేపల్లిగూడెం తూర్పుప్రాంత విద్యుత్తు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహమూర్తి గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలుపుదల ఉంటుందన్నారు.

## రైతు నేస్తాలకు రాయితీలు

**పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్**

**పెంటపాడు, న్యూస్‌టుడే**



రైతులు, వ్యవసాయ కూలీలు సాగుతోపాటు ఇతర ఆదాయ మార్గాలతో ఆదాయం పెంపొందించుకుంటారు. సాధారణంగా రైతుల నేస్తాలలైన ఎడ్లు, పాలిచ్చే ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పొట్టేళ్లకు వర్షాకాలం, చలికాలంలో రోగాలు ఎక్కువగా వస్తుంటాయి. వీటికి సంబంధించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రభుత్వం అందించే రాయితీలపై పెంటపాడు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ న్యూస్‌టుడేతో వివరించారు.

### అప్రమత్తంగా ఉండాలి..

★ గొర్రెలు, మేకలకు పారుడు రోగం వస్తుంది. దీని నుంచి బయటపడేందుకు ఉచితంగా టీకాలు వేస్తాం. గొర్రెల మేకల పెంపకందారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పశువులకు సోకే గాలికుంటు వ్యాధితో నోట్లో, గిట్టల దగ్గర పుండ్లు వస్తాయి. పాల దిగుబడి తగ్గుతుంది. వ్యవసాయ పనులు చేసే ఎద్దులకు బలం తగ్గి పనిచేయలేవు. ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం.

★ ఈ సీజన్‌లో ఎక్కువగా శ్వాసకోస వ్యాధులు వస్తుంటాయి. వర్షానికి తడవకుండా పరిశుభ్రమైన ప్రదేశంలో పశువులను ఉంచాలి. మూడు రోజులపాటు వైద్య సేవలందించాలి.

★ పొలాలు, బురద, తడి నేలల్లో మట్టితో గిట్టలకు వ్యాధులు వస్తాయి. గిట్టలకు రావడతో నొప్పితో నడవలేక ఇబ్బందులు పడతాయి. పశువుల ఆసుపత్రిలో వాటికి పెన్సిలిన్ వేయించాలి.

★ పొదుగు వాపు రాకుండా జాగ్రత్తలు పాటించాలి. పాలు పిండే ముందు వస్త్రంతో తుడవాలి. పొదుగులో పాలను పూర్తిగా పిండాలి. పాలు పిండటం పూర్తయిన తర్వాత 15 నిమిషాలకు పశువులు పడుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**రాయితీలు ఇవీ..**

మినీ గోకులం పథకంలో భాగంగా రైతులకు షెడ్లు ఏర్పాటు చేసుకోవచ్చు. రెండు సెంట్ల స్థలం, ఉపాధి పథకానికి సంబంధించిన జాబ్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతాకు సంబంధించిన పాసుపుస్తకం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ★ పశువులున్న వారికి పశుకిసాన్ కార్డు కింద రుణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఏడు శాతం వడ్డీతో పశువులకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు రుణాలు పొందవచ్చు. గరిష్ఠంగా ఎనిమిది పశువులు(ఆవులు, గేదెలు) వరకు రూ.1.80 లక్షలు రుణం ఇస్తారు.

## దోమల నిర్మూలనపై దృష్టి



తాడేపల్లిగూడెం: గంబూషియా చేపలు వదులుతున్న సిబ్బంది

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** నీటి నిల్వలు అధికంగా ఉండే చెరువులు, కాలువల్లో గంబూషియా చేపలను వేయడం ద్వారా దోమల వ్యాప్తి నివారించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలోని డీఎస్, కొండయ్య చెరువు ప్రాంతాల్లో గురువారం వీటిని వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా చేపలు దోమల లార్వాను ఆహారంగా తీసుకుంటాయన్నారు. తద్వారా దోమలు నివారించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** తణుకు పట్టణంలోని పలు చెరువుల్లో గంబూషియా చేప పిల్లలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వదిలారు. ఆయన మాట్లాడుతూ గంబూషియా చేపలు దోమ లార్వాలను తినడం ద్వారా దోమ పుట్టుకకు చెక్ పెడతాయన్నారు. సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## 'ఆధార్' శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీడీవో, ఈవోపీఆర్డీ

**అత్తిలిగ్రామీణం, న్యూస్‌టుడే:** అత్తిలి మండలంలో ఆధార్ నవీకరణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని అత్తిలి ఎంపీడీవో శామ్యూల్ సూచించారు. గురువారం వరిఘేడు, కొమ్మర, అత్తిలి, పాలూరు, ఈడూరు గ్రామాల్లో ఆధార్ శిబిరాలను సందర్శించారు. అనంతరం కొమ్మర జడ్పీ ఉన్నత పాఠశాల సందర్శించి విద్యార్థులకు అందించే భోజనాల నాణ్యతను ఎంపీడీవో శామ్యూల్, విస్తరణాధికారి శ్రీనివాస్ పరిశీలించారు.

## సృజనకు పదును

**'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు**



తాడేపల్లిగూడెం: విజేతలతో ఉపాధ్యాయులు



తణుకులో..

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** 'ఈనాడు' ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని భాష్యం పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు గురువారం నిర్వహించారు. మొబైల్ ఫోన్ వినియోగం వల్ల లాభాలున్నాయా? నష్టాలున్నాయా? మీకు ఎదురైన అనుభవాలు అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఏజే ప్రవీణ, జెసీక, జి. సులోచనలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌బాబు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** తణుకు పట్టణంలోని బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఈనాడు ఆధ్వర్యంలో అంతర్జాలం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విద్యాహాసిని, కావ్యశ్రీ, భార్గవి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రభువరన్, ఉపాధ్యాయులు నాగరాజ్యం, సీతామహాలక్ష్మి, కామేశ్వరి, రాంబాబు బహుమతులు అందజేశారు.

## బాలలతో పని చేయిస్తే చర్యలు



దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పోలీస్, కార్మిక, స్త్రీ శిశు సంక్షేమ, విద్యా, సామాజిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీ చేశారు. మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఉన్నిసా మాట్లాడుతూ తణుకులోని 6 ఫిల్లింగ్ స్టేషన్లలో బాల కార్మికులను గుర్తించినట్లు తెలిపారు. నవంబరు 20 వరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. దుకాణదారులు, పరిశ్రమ యజమానులు బాల కార్మికులను నియమించుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కూడళ్లు.. ప్రమాద వాకిళ్లు



పెంటపాడు, న్యూస్‌టుడే: పెంటపాడు మండలం అలంపురంలోని 216ఎ జాతీయ రహదారి కూడలి ప్రమాదకరంగా మారింది. నిత్యం దీనిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ కూడలిలో పోలీసుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రమాదకరంగా మారింది. ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డబ్బాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కూడలి వద్ద వాహనాలు మితిమీరిన వేగంతో వస్తున్నాయి. వాహనచోదకులు అడ్డదిడ్డంగా మలుపులు తిప్పుతుండటంతో మరింత ప్రమాదకరంగా మారింది. గత మార్చి నుంచి ఇప్పటి వరకు జరిగిన 15 ప్రమాదాల్లో 10 మంది గాయపడగా అయిదుగురు మృతి చెందినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ ప్రదేశంలో ప్రమాదాలు చోటు చేసుకోకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు. దీనిపై ఎస్సై స్వామి మాట్లాడుతూ కూడలిలో స్టాపర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రీసర్వే గ్రామ సభలో 12 ఫిర్యాదులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: భూముల రీసర్వే లోపాలను గ్రామ సభల ద్వారా సరిదిద్దుకోవాలని సర్వే సహాయ సంచాలకుడు షేక్ మహమూద్ అన్సారీ సూచించారు. రాచూరులో గురువారం భూముల రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కూటం రామకృష్ణ పాల్గొన్నారు. 12 ఫిర్యాదులు అందాయని మండల సర్వేయర్ విశ్వనాథ్ తెలిపారు.

## ట్యాంకర్లతో నీటి సరఫరా

ఉంగుటూరు, న్యూస్‌టుడే: మండలంలోని గోపినాథపట్నం శివారు కాలనీలో మోటారు మరమ్మతుకు గురవడంతో అయిదు రోజులుగా స్థానికులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. రోజులు గడుస్తున్నా సమస్యను పరిష్కరించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టికి వెళ్లడంతో శ్రీలక్ష్మీనారాయణ ఫౌండేషన్ ద్వారా గురువారం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్: ఆరిమిల్లి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ ప్రభుత్వ అసమర్థ పాలనలో ప్రజలు మోసపోయి అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. దర్బార్‌లో ప్రజల నుంచి వచ్చే వినతులను క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమానికి 300 అర్జీలు వచ్చాయని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, సిబ్బంది, ఎన్డీయే నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ★ పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. ప్రపంచ పోలియో దినోత్సవం పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కళాశాల నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ చేపట్టి మాట్లాడారు.

## 28న మహా విజ్ఞాన దీక్ష



మాట్లాడుతున్న భీమారావు తదితరులు

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్ల సొమ్ము చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ 28న విజయవాడలో తలపెట్టిన మహా విజ్ఞాన దీక్ష విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ వినియోగదారుల, ఏజెంట్ సంక్షేమ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. స్థానిక కామ్రేడ్ వంకా సత్యనారాయణ సురాజ్య భవన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం బాధితులకు పూర్తి న్యాయం చేయాలని కోరారు. మహిళా విభాగం కార్యదర్శి నాగలక్ష్మి, పట్టణ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గోతుల దారి.. అవస్థలే మరి



తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: ఏలేటిపాడు నుంచి ఇరగవరం వెళ్లే రహదారి గోతులతో అధ్వానంగా మారింది. పెనుగొండ, నరసాపురం, పెరవలి ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షం పడిన సమయాల్లో గోతుల్లో నీరు చేరి ప్రయాణించేందుకు చోదకులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

## దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు

ఉండి, న్యూస్‌టుడే: మండలంలో చోరీలు అరికట్టేందుకు అన్నిరకాల చర్యలు తీసుకున్నామని ఆకివీడు సీఐ వి.జగదీశ్వరరావు అన్నారు. ఉండి ప్రధాన వంతెన కూడలిలో ఎస్సై మహ్మద్ నసీరుల్లాతో కలిసి గురువారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. నంబర్లు లేని, అనుమానమున్న వాహనాలు ఆపి దస్త్రాలు క్షుణ్ణంగా పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ.. ఇటీవల గొలుసు దొంగతనాల ముఠా నంబర్లు లేని వాహనాలపై సంచరిస్తూ నేరాలకు పాల్పడుతోందన్నారు. ఎస్పీ ఆదేశానుసారం విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఆకివీడు: అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై నాగరాజు సూచించారు. ఆకివీడులోని వివిధ కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ.. దొంగల చిత్రాలు చూపుతూ స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రయాణికులు స్వీయ జాగ్రత్తలు పాటిస్తూ.. నగదు, బంగారు ఆభరణాలు భద్రంగా ఉంచుకోవాలని ఆయన కోరారు.

## కోళ్ల వ్యర్థాల లారీ స్వాధీనం

పెదపాడు, న్యూస్‌టుడే: కోళ్ల వ్యర్థాలను రవాణా చేస్తున్న లారీని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై సతీష్ తెలిపారు. విజయవాడ పరిసర ప్రాంతాల నుంచి సేకరించిన కోళ్ల వ్యర్థాలను మండలంలోని చేపల చెరువులకు తరలిస్తుండగా తోటగూడెం వద్ద పట్టుకున్నామన్నారు. లారీ యజమాని, డ్రైవర్, క్లీనర్లపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

## చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పెంటపాడు, న్యూస్‌టుడే : చోరీ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు పెంటపాడు ఎస్సై స్వామి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం పోలీస్‌స్టేషన్ వద్ద వెల్లడించారు. ఏప్రిల్ నెలలో పెంటపాడు సంతబజారు సమీపంలోని ఓ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి బీరువాలోని బంగారు, వెండి వస్తువులను అపహరించాడు. దీనిపై బాధితులు పెంటపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు భీమవరంలోని చినపేటకు చెందిన జువ్వల ఆశోక్‌కుమార్‌ను శుక్రవారం అదుపులో తీసుకున్నారు. దీనిపై విచారించగా నేరం చేసినట్లు అంగీకరించాడు. అతని నుంచి రూ.80 వేల విలువైన బంగారు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపర్చామని ఎస్సై తెలిపారు.

## దారి వివాదంపై కేసు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: జగన్నాథపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో దారి వివాదంపై గెడ్డం కాంతమ్మ ఫిర్యాదు మేరకు పది మందిపై కేసు నమోదు చేశామని గ్రామీణ ఎస్సై ప్రసాద్ గురువారం తెలిపారు.

"చేనేత కార్మికుల ఇళ్లకు ఉచిత విద్యుత్తు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే అమలు చేశారు. ఇటీవలే విద్యుత్తు కార్యాలయంలో ఉచిత విద్యుత్తు కోసం దరఖాస్తు చేసుకున్నాను." అని రామచంద్రాపురానికి చెందిన సిద్ధాని వరలక్ష్మి అన్నారు.

"ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం కృషి చేయడం సంతోషంగా ఉంది. గత వైకాపా ప్రభుత్వంలో అన్ని రకాలుగా ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాం. గతంలో తెదేపా అధికారంలో ఉన్నప్పుడు ప్రతి నెలా చేనేతలకు ఆదాయం సమకూర్చేలా 11 సంక్షేమ పథకాలు అమలు చేసేది. ఈ సారి ఉచిత కరెంటు ఇచ్చి మరింత భరోసా కల్పించారు." అని వేల్పూరుకు చెందిన సత్యనారాయణ పేర్కొన్నారు.

# చేనేతకు చేయూత

## ఉచిత విద్యుత్తు హామీ అమలు

**పెంటపాడు, న్యూస్‌టుడే**

తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లోని రామచంద్రాపురం, మీనవల్లూరు, వేల్పూరు, ఇలింద్రపర్రు గ్రామాల్లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది జీవనాధారం చేనేత పరిశ్రమనే. గత వైకాపా ప్రభుత్వం చేనేతకు వచ్చే రాయితీ పథకాలు తొలగించి 'నేతన్న నేస్తం' పేరుతో సంవత్సరానికి రూ.24 వేలు ఖాతాల్లో జమ చేసి, మమ అనిపించారు. గతంలో ఉచిత కరెంటు ఇస్తామన్న వైకాపా మొండిచేయి చూపింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 100 యూనిట్ల లోపు కరెంటు బిల్లు ఉన్న వారు ఛార్జీలు చెల్లించాల్సిన పని లేదని ప్రకటించింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే హామీ అమలు చేయడంపై చేనేతలు హర్షం వక్తం చేస్తున్నారు.

**దరఖాస్తు ఇలా...** చేనేత కార్మికులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేసింది. వాటితోపాటు ఆధార్‌కార్డు, 100 యూనిట్లలోపు వచ్చిన కరెంటు బిల్లు, చేనేత కార్మికుడిగా ఉన్న చిత్రంతో సమీపంలోని సచివాలయానికి లేదా విద్యుత్తు కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు సమర్పించాలి. దరఖాస్తు చేసిన రెండు మూడు రోజుల్లో సంబంధిత విద్యుత్తుశాఖ లైన్‌మ్యాన్ పరిశీలనకు వస్తారు. విచారించి అర్హులను గుర్తిస్తారు.

**తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాల్లో చేనేత కార్మికుల వివరాలు**

| గ్రామం | సభ్యులు |
|---|---|
| రామచంద్రాపురం | 80 |
| మీనవల్లూరు | 70 |
| వేల్పూరు | 227 |
| ఇలింద్రపర్రు | 240 |


రామచంద్రాపురంలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికురాలు

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

| | |
|---|---|
| తాడేపల్లిగూడెం | :79950 67078 |
| పెంటపాడు | :79939 36123 |
| తణుకు గ్రామీణ | :85558 50851 |
| అత్తిలి | :91548 46774 |

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే**

**సమస్య:** తాడేపల్లిగూడెం పట్టణం సుబ్బారావుపేటలోని పాత ఆంధ్రాబ్యాంకు రోడ్డులో పురపాల పైపులైను మరమ్మతులకు తవ్విన గుంత పూడ్చకపోవడంతో రాకపోకలకు ప్రమాదకరంగా మారింది **- శివానంద్, స్థానికుడు**

**సమాధానం:** పరిశీలించి పైపులైను గుంత త్వరితగతిన పూడ్చేలా చర్యలు చేపడతాం **- ప్రసాద్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్**

**సమస్య:** తాడేపల్లిగూడెం పట్టణం సత్యవతినగర్‌లో కుక్కల సంచారంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు **- అజయ్, స్థానికుడు**

**సమాధానం:** కుక్కల సంచారాన్ని అరికట్టేలా చర్యలు చేపడతాం **- ఏసుబాబు, పురపాలక కమినర్**

**పెంటపాడు, న్యూస్‌టుడే**

**సమస్య :** పెంటపాడు ప్రభుత్వ పోస్ట్‌బేసిక్ ప్రాథమిక పాఠశాల గోడకు ఆనుకొని కొందరు వ్యర్థాలు, చెత్త పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోంది. **- శివకుమార్, స్థానికుడు**

**సమాధానం :** చెత్త తొలగించి శుభ్రం చేయిస్తాం. **- బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

**సమస్య :** పెంటపాడు మండలం మీనవల్లూరు సచివాలయానికి ఆనుకొని ఉన్న కాలనీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. డ్రెయిన్లు పూడిపోవడంతో పాటు, చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. **- శ్రీను**

**సమాధానం :** పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకుంటాం. **- ప్రసాద్, ఈవోపీఆర్డీ**

## మెరుగైన వైద్య సేవలందించండి : బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** రోగులుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలను గురువారం నిర్వహించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. గర్భిణిపై నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆసుపత్రి బెడ్‌పై ప్రసవించిన ఘటనకు కారణమైన నర్సును విధుల నుంచి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షణాధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 అథ్లెటిక్స్ విభాగంలో తాడేపల్లిగూడెం నల్లజర్ల రోడ్డు కడకట్ల మహాత్మ జ్యోతిబాపులే సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల విద్యార్థి హేమనాగ వెంకట కుమార్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సూర్యకుమారి గురువారం తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపల్ సూర్యకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## సత్ప్రవర్తనతో మెలగాలి

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** విద్యార్థులు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవిస్తూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని పట్టణ ఎస్సై శ్రీనివాస్ సూచించారు. గురువారం స్థానిక బాలుర జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని పద్మావతి అధ్యక్షతన ప్రత్యేక పోలీసు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మాజీ కౌన్సిలర్ మల్లిన రాధాకృష్ణ, స్టాఫ్ సెక్రటరీ ప్రభువర, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత డీఎస్సీ శిక్షణ

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమ అధికారి రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబరు 3న దీనికి సంబంధించిన పరీక్ష జరుగుతుందన్నారు. మార్కుల ఆధారంగా శిక్షణ తరగతులకు ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## నేడు శంకుస్థాపన

**నిడమర్రు, న్యూస్‌టుడే:** పత్తేపురం- తోకలపల్లి రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. దీని నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి కేటాయించింది. ఈ నెల 25న పనులకు శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీ మహేశ్ కుమార్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొంటారు. రహదారి నిర్మాణంతో పత్తేపురం, ఆముదాలపల్లి, బైనేపల్లి, తోకలపల్లి గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది.

## శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

**గణపవరం, న్యూస్‌టుడే:** ఆధార్ శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి దోసిరెడ్డి అన్నారు. గణపవరం సచివాలయం-2లో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం రెవెన్యూ రీసర్వే గ్రామ సభలో పాల్గొన్నారు. చినరామచంద్రపురం ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

■ ఓర్పుతోపాటు నేర్పు ఉన్నవారికి ఏ పనిలోనైనా విజయం తథ్యం – విలియం షేక్‌స్పియర్



## తాడేపల్లిగూడెం ఆర్డీవోగా కౌసర్ భానో

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే :** తాడేపల్లిగూడెం ఆర్డీవోగా ఖతీజ్ కౌసర్ భానో నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రామచంద్రాపురం ఆర్డీవోగా పని చేసిన ఈమె సాధారణ బదిలీల్లో భాగంగా తాడేపల్లిగూడెం వచ్చారు. ఇక్కడి ఆర్డీవోగా ఇటీవల బాధ్యతలు నిర్వహించిన భవానీ శంకరి నగరికి బదిలీ అయ్యారు.

# అధ్వానంగా మార్గం



ప్రమాదకరంగా తాత్కాలిక బాట



మాధవరం నుంచి ఎర్రకాలువకు వెళ్లే రోడ్డు దుస్థితి

**మాధవరం (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే:** తాడేపల్లిగూడెం మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు వేల ఎకరాల పంట పొలాలతో పాటు రహదారులు దెబ్బతిన్నాయి. మాధవరం నుంచి కంసాలిపాలెం వెళ్లే రహదారి ఎర్రకాలువ వరదకు 2 కి.మీ. మేర కొట్టుకుపోయి కందకాలను తలపిస్తుంది. పరిసర గ్రామాల ప్రజలు, మాధవరం రైతులు ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. 2020లో ఎర్రకాలువ వంతెన నీటి ఉద్ధృతికి కొట్టుకు పోగా అప్పటి వైకాపా నాయకులు వంతెన నిర్మాణం చేపడతామని విస్మరించడంతో స్థానికులు తాత్కాలిక బాటపై రాకపోకలు సాగిస్తున్నారు. వరదలకు అదికాస్త కోతకు గురై రాళ్లుతేలి గుంతలతో దర్శనమిస్తోంది. మాధవరం రోడ్డు కోతకు గురై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని రైతు నీలం గోపాల కృష్ణ వాపోయారు.



మాట్లాడుతున్న హరికుమార్

## డీఆర్ బకాయిలు చెల్లించండి

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే :** ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా పింఛన్‌దారులకు డీఆర్ బకాయిలతో పాటు అడిషనల్ క్వాంటమ్ పునరుద్ధరణ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని తాడేపల్లిగూడెం పింఛను దారుల సంఘ యూనిట్ అధ్యక్షుడు హరికుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సంఘ భవనంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బాలకృష్ణ, సత్యనారాయణ మూర్తి, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కొండలరావు

## శిరస్త్రాణం తప్పని సరి

**తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే:** ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ట్రాఫిక్ ఎస్సై కొండలరావు అన్నారు. స్థానిక కేఎన్ రోడ్డులో అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బాబ్జీ తదితరులు

## బాధిత కుటుంబానికి పరామర్శ

**తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే:** తాళ్లపాలెంలో ఇటీవల మృతి చెందిన మెండెలి శ్రీను కుటుంబాన్ని తాడేపల్లిగూడెం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి వలవల బాబ్జీ గురువారం పరామర్శించారు. వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, వాడపల్లి సుబ్బరాజు ఎన్‌డీఏ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు పట్టాలు

**ఆకివీడు, న్యూస్‌టుడే:** స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో 68 మంది పేదలకు ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు చేతులమీదుగా గురువారం ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. స్థానిక అయిభీమవరం రోడ్డు తదితర ప్రాంతాల లబ్ధిదారులకు తాళ్లకోడు లోని 74 ఎకరాల లేఅవుట్‌లో స్థలాలు కేటాయించారు. కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవరప్రసాద్, పట్టణాధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, కమిషనర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 27న రౌండ్ టేబుల్ సమావేశం

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** బహుజన రాజకీయ పార్టీలు, సంస్థల ప్రతినిధులు, ప్రముఖుల రౌండ్ టేబుల్ సమావేశం ఈ నెల 27న ఉదయం 10 గంటలకు స్థానిక యాదవ కమ్యూనిటీ హాలులో నిర్వహించనున్నట్లు బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బహుజనుల ప్రాతినిధ్యంపై సమావేశంలో చర్చించి తీర్మానిస్తామన్నారు.

## బాణసంచా స్వాధీనం

**పెదపాడు, పెదవేగి, న్యూస్‌టుడే:** అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి ఎస్సై సతీష్ తెలిపారు. పెదపాడు మండలం ఏపూరులోని ఓ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న రూ.1,56,568 విలువైన బాణసంచాను గుర్తించామన్నారు. నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. ● పెదవేగి మండలం ముండూరులో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న బాణసంచాను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన కొనకళ్ల వెంకటకృష్ణ వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** నగర పాలక పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులను డిప్యుటేషన్ విధానంలో సర్దుబాటు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఆ సంఘం జిల్లా కోశాధికారి బి.రాము, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, జి.సాయి శ్రీనివాసరావు తదితరులు గురువారం ఏలూరు ఎంఈవో-1 రవిప్రకాశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని 8 పాఠశాలల్లో అయిదు తరగతులకు ఇద్దరేసి ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు భవిష్య నిధి వెంటనే చెల్లించాలని కోరారు.



## ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

**అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే:** అత్తిలి మండలంలో పాఠశాలలకు సైకిళ్లు నిలిపేందుకు ప్రాంగణాల్లో స్థలం లేదు. పాఠశాల బయటే సైకిళ్లు నిలుపుదల చేస్తున్నారు. అత్తిలి బాలికోన్నత పాఠశాలలో 350 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. శాఖా గ్రంథాలయ ప్రాంగణంలో సైకిళ్లు ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. ★ అత్తిలి సంతమార్కెట్ వద్ద ఎంపీయూపీ పాఠశాల బయట ఎండలోనే సైకిళ్లు నిలుపుదల చేస్తున్నారు. నీడ లేకపోవడంతో ఎండ తీవ్రతకు టైర్లలో గాలితగ్గి పోతోందని విద్యార్థులు వాపోతున్నారు.



## శిథిలావస్థలో కల్వర్టు రక్షణ గోడ

**పెంటపాడు, న్యూస్‌టుడే :** పెంటపాడు మండలం జట్లపాలెంలోని మిడ్ లెవల్ కాలువ లాకుల వద్ద కల్వర్టుకు ఇరువైపులా రక్షణగోడ శిథిలవస్థకు చేరింది. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని చోదకులు కోరుతున్నారు. ర.భ.శా ఏఈ రవిబాబు మాట్లాడుతూ సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార చర్యలు చేపడతామన్నారు.



## మద్దిరావమ్మ గ్రామోత్సవం

**కాళ్ల, న్యూస్‌టుడే:** కాళ్ల గ్రామంలో మద్దిరావమ్మ ఊరేగింపు గురువారం సాయంత్రం అట్టహాసంగా సాగింది. ఎడ్ల బండిపై అమ్మవారి ప్రతిమ ఏర్పాటు చేసి.. అసాధులు, శక్తి వేషధారుల సందడి మధ్య జాతర జరిగింది. దారి పొడవునా మద్దిరావమ్మకు భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డీజే పాటలకు యువత నృత్యం చేస్తూ కోలాహలంగా కనిపించారు. మూడేళ్లకోసారి అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

## అన్నసమారాధన

**భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా మోటుపల్లివారివీధిలోని మావుళ్లమ్మ పూరిగుడి సమీప గోగులమ్మ ఆలయంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు, అర్చనలు చేసి విశేషాలంకరణ, సహస్ర నామ కుంకుమ పూజలు చేశారు. ఆపై అమ్మవారి ఎదుట భారీ పులిహోర కుంభం వేసి నైవేద్యం సమర్పించారు. భక్తులు, దాతల సహకారంతో సుమారు 6 వేల మందికి అన్నసమారాధన చేశారు. ఏర్పాట్లను ఆలయ అధ్యక్షుడు మోటుపల్లి చంద్రశేఖర్, కార్యదర్శి మోటుపల్లి నాగసత్యనారాయణ, కోశాధికారి మోటుపల్లి పల్లపురాజు, సభ్యులు పర్యవేక్షించారు.